సంపాదకీయం



## నీరు

మనిషికి తినడానికి తిండి, కట్టుకోడానికి బట్ట, వుండడానికి ఇంత చోటు కనీస అవసరాలుగా చెబుతారు. కానితిండికంటె కూడా అత్యవసరమైనది నీరు. మనిషికే కాదు చెట్టుచేమలతోపాటు అసంఖ్యాకమైన జీవరాశికి ప్రధాన అవసరం నీరే. ప్రకృతి ఉచితంగా అందించిన అమూల్య సంపద నీరు. కాని ఆ నీటిని, దానికి మూలమైన పర్యావరణాన్ని మనం సర్వవిధాల దుర్వినియోగం చేసిన దుష్ఫలితం ఇప్పుడు నీటి కరవుగా మనలను పీడిస్తున్నది. నానాటికి సమస్య తీవ్రమవుతున్నదే తప్ప సముచిత పరిష్కారం లేకుండా పోతున్నది. మన వివేకానికి, విచక్షణకు సవాలు విసురుతున్నది.

ఈ నేపథ్యంలో 12 వ పంచవర్ష ప్రణాళిక మన జాతీయ జలవిధానంలో సమూలమైన మార్పులు తీసుకురావాలని ప్రతిపాదించింది. కేవలం ప్రభుత్వపరంగా చేపట్టే చర్యలవల్లనే ఈ మార్పు సాధ్యంకాదు. మనందరం,ప్రతి ఒక్కరం ఈ బృహత్ కృషిలో పాలుపంచుకోవాలి. నీరు మనం తయారుచేయగలిగేది కాదు, మనం చేసేది కేవలం నీటిని వినియోగించడమే. కాని ఆ వినియోగించే తీరు సరిగా లేకపోవడమే ఇంతటి నీటి కరవుకు మూలం.రైతు ఆత్మహత్యలలో చాలావరకు పంటకు కావలసిన నీరు సకాలంలో చాలినంత అందక,దిగుబడి రాక, నష్టాల ఊబిలో చిక్కుకుని , బయటపడే మార్గం లేదన్న బేలతనంతో జరుగుతున్నవే. నీటి వినియోగంలో తగిన జాగ్రత్త పాటిస్తే ఈ దుస్థితిని మనం నిస్సందేహంగా నివారించగలం. నీటిని మనం తయారు చేయలేక పోవచ్చు, కాని సద్వినియోగంతో, పర్యావరణ పరిరక్షణ చర్యలతో జలవనరులను తిరిగి కళకళలాడించడం సాధ్యమే. రూపాయి పొదుపు చేయడం అదనంగా రూపాయి సంపాదించడంతో సమానం అంటారు. అలాగే నీటి దుబారాను తగ్గించుకోవడం, జలవనరుల పునర్వికాసానికి దోహదంచేసే విధంగా పర్యావరణాన్ని కాపాడు కోవడం అదనంగా నీటిని సృష్టించడంతో సమానమే! ఈ అంశాలపై అవగాహన పెంచడంకోసం ఏపిమాస్ కృషిచేస్తున్నది.ఇందులో భాగంగా జాతీయ జలవిధానంలో సమూలమార్పుల సాధ్యా సాధ్యాలపై హైదరాబాదులో కీర్తిశేషులు స్మరజిత్ రే స్మారకోప న్యాసాన్ని నిర్వహించింది. ఆ సమావేశ విశేషాలను ఈ సంచికలో చూడవచ్చు. ఇది మనందరి సమస్య. నేటి సమస్య మాత్రమే కాదు, నానాటికీ మరింత విషమిస్తున్న మహా సమస్య. సదవ గాహనతో, పరస్పర సహకారంతో మనం దీనిని పరిష్కరించుకోకపోతే మన మనుగడకే తీరని ప్రమాదం. భావి తరాలు మనను క్షమించవు.



జీవన వేదం

## దోషం

**గా**లి వీచనంటే ? సూర్యభగవానుడు ఉదయించనంటే? నీరు ప్రవహించనంటే ? మంట మండనంటే ? ఆకాశం మనపై పరచిన తన రక్షా కవచాన్ని తొలగిస్తానంటే ? యావత్ ప్రకృతి స్తంభించిపోతుంది. ప్రాపంచిక కార్యకలాపాలన్నీ ఎక్కడివక్కడ నిలిచిపోతాయి. వీరందరూ మహనీయులు; మహాశక్తి సంపన్నులు; అయినాఎటువంటి స్వార్ధ చింతన లేకుండా, లవలేశమైనా అహంకారం లేకుండా, క్రమశిక్షణ కలిగిన సైనికుల మాదిరిగా ఎంతటి క్లేశాన్నయినా భరిస్తూ తమ విధ్యుక్త ధర్మాన్ని ఏమాత్రం తప్పకుండా నిర్వర్తిస్తున్నారు. వీరి సర్వశక్తులు పరోపకారం కోసమే.సకల ప్రాణి సంరక్షణ కోసమే.అందుకే వారు దేవతలు! మనుష్య లోకంలో వీరికోవకు చెందిన సజ్జనులు, సత్పురుషులు కొందరు వున్నారు. వీరి తీరుకూడా ఇలాగే వుంటుంది. వారికి వున్నదేదైనా అసహాయులకు, అన్నార్తులకు ఇవ్వడానికే; వారి బలం బలహీనులను రక్షించడానికే. ఇక దుష్ట చిత్తులు, దుర్మార్గులు, దుర్జనులైన వారున్నారు.అసలే వారికి కళ్ళు నెత్తికెక్కి వుంటాయి. ఆపై సంపద తోడైతే, అధికారం జతైతే, అందచందాలు కొలువు దీరితే ? 'అసలే కోతి, ఆపై కల్లు తాగింది, తేలు కుట్టింది ...' అన్నట్టు రెచ్చిపోరూ? అదే ధనం, అదే బలం సజ్జనులలో పరోపకారానికి ఉపయోగపడితే, దుర్జనులలో పర పీడనకు ప్రేరణ అవుతున్నదంటుంది ఒక శ్లోకం. దోషం పదార్థంలో లేదు, దానిని వినియోగించే వ్యక్తులలో, వినియోగించే తీరులో వుంది. ఇలాంటి వారికి చదువుకూడా అజీర్ణ వ్యాధిగ్రస్తునికి బలవర్ధక ఆహారంలా వారి కుసంస్కారం, కుతర్కం మరింత పేట్రేగడానికే దోహద మవుతుంది. 'చేతులారంగ శివుని పూజింపడేని, నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని, దయయు సత్యంబు లోనుగా తలపడేని కలుగనేటికి తల్లుల కడుపుచేటు' అని కవి అభిశంసించినట్టు దయ, సత్యం, ధర్మం, వినయం వంటి సహృదయ భావాలకు తావులేని ఇలాంటి దుష్టచేష్టులు తమ అంగబలాన్ని, అర్ధబలాన్ని, అధికార బలాన్ని చూసుకుని అహంకారంతో విర్రవీగుతారు. 'మనుష్య రూపేణ మృగాశ్చరంతి' అన్నట్టు మానవత్వానికి దూరమై తిరిగి ఆటవిక స్వభావానికి, ఆపై రాక్షస, పైశాచిక ప్రవృత్తికి అలవాటుపడి సర్వభ్రష్టులవుతారు. 'ధర్మో రక్షతి రక్షిత:!

ఆసక్తిగలవారి కోసం ఆ శ్లోకం

**గర్వాయ పరపీడాయై దుర్జనస్య ధనం బలం**
**సజ్జనస్య తు దానాయ రక్షణాయ చ తే సదా**

Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt. Limited , S.No.185, Kondapur, Ranga Reddi District,Hyderabad-500133,Telangana; Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDA Colony, Tanesha Nagar, Near Dream Vally, Manikonda, Rangareddi District, Hyderabad-500 089. **Editor:** T. Chandra Sekhar Reddy

**డబ్బు, సమయం - ఈ రెంటినీ సక్రమంగా ఉపయోగించుకోగలగడమే తెలివి అంటే**

## లోపలి పేజీలలో....


- సత్ఫలితాలనిస్తున్న రైతుమిత్రల క్షేత్ర సందర్శన. ...05
- నీటి సంక్షోభం పరిష్కారానికి పది సూత్రాలు ...06
- జి4 రైతు సంఘాలచే రబీలో పంటలు ...09
- విత్తనాల మొలకశాతం తెలుసుకునే పద్ధతులు ...10
- అప్పు దారి మళ్ళితే ...సాగు దారి తప్పితే..! ...11
- తాగునీటి అవసరాలు తీరుస్తున్న సేద్యపుగుంట!...12
- వికలాంగుల కార్యవర్గ నిర్వాహకులకు శిక్షణ ...13
- మహిళల భద్రతకు విస్తృతంగా చర్యలు ...14
- భ్రూణహత్యల నివారణలో రాష్ట్రాలు విఫలం ...16
- ఆహారపదార్థాలలో కల్తీని కనుగొనడం ఎలా? ...18
- మహిళల ప్యాంటీస్ తయారీ పరిశ్రమ ...25
- అధిక ఆదాయాన్నిచ్చే జీడిమామిడి సాగు. ...26
- పంచాయతీలో పనులు నిర్వహించే పద్ధతి. ...31
- కుటీర పరిశ్రమగా పుట్టగొడుగుల పెంపకం ...33



ఎడిటర్ : టి. చంద్రశేఖర రెడ్డి

అసోసియేట్ ఎడిటర్: జె.వి. క్రిష్ణమూర్తి

ఎడిటోరియల్ కమిటి

ఏ. కళామణి , ఎస్. రామలక్ష్మి

ఎన్.వినాయకరెడ్డి, బి.వెంకటేశ్వర్లు

కంపోజింగ్, డిజైనింగ్

కె.మస్తాన్‌వలి, ఎన్.రమాదేవి

కన్సల్టెంట్ : కె.రఘురామరాజు



'మహిళా సాధికారత ' అనంతమైన భిన్నత్వంనుంచి ఆశావహమైన ఏకత్వానికి వేదిక. ఈ పత్రికలో ప్రచురించే రచనలలో వ్యక్తమయ్యే అభిప్రాయాలు పత్రికా నిర్వాహకుల అభిప్రాయాలు కాకపోవచ్చు .


### మహిళా సాధికారత ప్రోత్సాహక చందా

| ఏడాదికి | రెండేళ్ళకు | మూడేళ్ళకు |
|---|---|---|
| రూ.110 | రూ.200 | రూ.280 |

### ప్రకటన ఛార్జీలు

| | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి(సగం) : | రూ।। 25,000 |
| మల్టీకలర్ బాక్ కవర్‌పేజి | రూ।। 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్‌పేజి | రూ।। 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ పూర్తి పేజి(లోపలి) | రూ।। 10,000 |

**గమనిక**: చందాలు లేదా ప్రకటనలకోసం పంపే చెక్కులను, డిడిలను 'ఏపిమాస్-హైదరాబాద్' పేరుమీద మాత్రమే పంపాలి


### మహిళా సాధికారత

ఏపిమాస్ కార్యాలయం

ప్లాట్ నెం. 11-12, హుడా కాలని

తానీషా నగర్, డ్రీమ్‌వ్యాలీ దగ్గర

మణికొండ, రంగారెడ్డి జిల్లా

హైదరాబాద్ - 500089.

ఫోన్స్ : 08413 ÷ 403118/19/20

ఫాక్స్ : 08413 - 403117

Web: www.apmas.org

E mail: info@apmas.org


పరీక్షకు నిలవని జీవితం జీవితమే కాదు

# సత్ఫలితాలనిస్తున్న రైతుమిత్ర గ్రూపుల క్షేత్ర సందర్శన

**- వినాయకరెడ్డి**

**క్షేత్ర** సందర్శనలు, లేదా అవగాహన పర్యటనలు ఎంతటి సత్ఫలితాలనిస్తాయో చిత్తూరు జిల్లా వి కోట, రామ సముద్రం మండలాలలో రైతుమిత్ర గ్రూపులను చూస్తే తెలుస్తుంది. జి4 కార్యక్రమాలలో భాగంగా ఏపిమాస్ ప్రోత్సాహంతో రూపుదిద్దుకున్న రైతుమిత్ర గ్రూపులు , మైక్రో వాటర్‌షెడ్ కమిటీలు ఇటీవల చల్దిగానిపల్లె రైతుమిత్ర గ్రూపుకు క్షేత్ర సందర్శనకు వెళ్ళి వచ్చిన తర్వాత ఈ గ్రూపులలో కూడా చైతన్యం వెల్లివిరుస్తున్నది.



ఈ మండలాలలో ఇప్పటివరకు 3 రైతుమిత్ర గ్రూపులు ఏర్పాటయ్యాయి. ఇదే ఆశయంతో ఏర్పడిన మరి రెండు రైతుమిత్ర గ్రూపులను కూడా వీటితోపాటే పటిష్టపరచాలని భావించి, ఈ మొత్తం 5 రైతుమిత్ర గ్రూపులను, 9 మైక్రో వాటర్‌షెడ్ కమిటీలను (210 మందిని) 2014 అక్టోబర్, నవంబరు నెలలలో చక్కగా కార్యక్రమాలు చేసుకుంటున్న చల్దిగానిపల్లె రైతుమిత్ర గ్రూపునకు క్షేత్ర సందర్శనకు (8 బ్యాచ్‌లుగా 8 రోజులు) తీసుకువెళ్ళడం జరిగింది.

సందర్శన ముగిసిన తరువాత ప్రతి బ్యాచ్‌వారితో ఏపిమాస్ సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి క్షేత్రసందర్శన ద్వారా వారు ఏమి నేర్చుకున్నదీ, ఈ కొత్త అవగాహనతో వారు తమ గ్రూపును ఎలా నడుపుకోవాలని అనుకుంటున్నదీ అడిగి తెలుసుకుని వారిని కార్యోన్ముఖులను చేసే ప్రయత్నం జరిగింది.

"మేము కూడా చల్దిగానిపల్లె చైతన్య రైతుమిత్ర గ్రూపులా తయారవుతాం" అని మన రైతుమిత్ర గ్రూపులు చెప్పగా, "మా గ్రామాల్లో కొత్త గ్రూపులు ఏర్పాటు చేసుకుంటా"మని మైక్రో వాటర్‌షెడ్ కమిటీవారు చెప్పారు.

**చేపట్టిన కార్యక్రమాలు:** నడిమంత్రం వివేకానంద రైతుమిత్ర గ్రూపు. వారు వర్మీ కంపోస్టు తయారుచేసుకోవడం కోసం తొట్టెలు కట్టు కుంటున్నారు. వారి గ్రామ పాఠశాలలో ఉన్న చెత్తకుప్పలను తొలగించారు.

- చల్దిగానిపల్లె వారు పండించని కాకర వంటి కూర గాయలను పండించి, చల్దిగానిపల్లె చైతన్య రైతుమిత్ర గ్రూపు ద్వారా తిరుమల-తిరుపతి దేవస్థానం వారికి సరఫరా చేస్తున్నారు.
- సుద్దుల కుప్పం రైతుమిత్ర గ్రూపు బంగాళాదుంపలు సేంద్రియ ఎరువులతో పండించే ప్రదర్శన ప్లాట్ ఏర్పాటు చేస్తున్నారు.
- బోయచిన్నగానపల్లె రైతుమిత్ర గ్రూపు వారు నెలనెలా పొదుపు ప్రారంభించారు. పూలతోటలు పెంచాలని నిర్ణయించుకున్నారు.
- వోగు, చొక్కండ్లపల్లె మైక్రో వాటర్‌షెడ్ కమిటీరు వారి గ్రామాల్లో జి4 కార్యక్రమం తరపున రైతుమిత్ర గ్రూపులు ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించుకున్నారు.

అందుకే "వినడం కన్న, ప్రత్యక్షంగా చూడడం ద్వారా వయోజనులు బాగా నేర్చుకుంటారు" అని వయోజన విద్యా సూత్రాలలో చెప్పారు. ఈ గ్రూపులన్నీ వినడంతోపాటు ప్రత్యక్షంగా చూడడంతో నేర్చుకున్నవి చక్కగా అమలుచేసి సత్ఫలితాలు సాధించి అభివృద్ధి చెందాలని ఆశిద్దాం. ❐

**వైఫల్యాలతో పలువురు వెనుదిరుగుతారు పట్టుదల గల కొద్దిమంది అక్కడినుంచే విజయయాత్ర మొదలుపెడతారు**

# నీటి సంక్షోభం పరిష్కారానికి పది సూత్రాలు

**- జె వి క్రిష్ణమూర్తి**

'మరో ప్రపంచ యుద్ధమంటూ జరిగితే అది నీటి కోసమే' అనే వ్యాఖ్య నీటి సంక్షోభ తీవ్రతను చాటుతుంది. ఇప్పటికే రాష్ట్రాల మధ్య, దేశాల మధ్య నీటికోసం నిత్యం జరుగుతున్న కీచులాటలను చూస్తున్నాం.నీటి కొరతే ఇందుకు మూలం.కారణాలు ఏవైనా, లోపాలు ఎవరివైనా ఇప్పుడు అందరూ ఈ నీటి కొరత బాధితులే! ఇప్పటికైనా దృష్టి సారించకపోతే, 'ఇంతింతై వటుడింతై' అన్నట్టు యావత్ ప్రపంచానికి ఇది మహా విపత్తుగా మారనుంది.

అందుకోసమే 12 వ పంచవర్ష ప్రణాళిక ఈ సంక్షో భానికి సమూల, సమగ్ర పరిష్కారాన్ని అన్వేషించి, పది సూత్రాల పథకాన్ని రూపొం దించింది. అయితే, పథక రచన వేరు, దానిని అమలు జరపడం వేరు.అమలు జరిపే చిత్తశుద్ధి లేకపోవడం ప్రధాన లోపమైతే, చిత్తశుద్ధి వున్నా ఎదురయ్యే సమస్యలు అనేకం. ముందుగా ఇలాంటి సమస్యలను సక్రమంగా అవగాహన చేసుకుని అధిగమించ గలిగితే, దశ సూత్ర పథకం అమలు సులువవు తుంది. అదే ఉద్దేశంతో, అభివృద్ధి రంగంలో విశేషానుభవం కలిగిన ఏపిమాస్; ఆర్థిక, సామాజికాంశాల అధ్యయన కేంద్రం (సెస్) తోడ్పాటుతో ఈ నెల 24వ తేదీన హైదరాబాదు లో సెస్ ఆడిటోరియంలో ఒక ప్రసంగ కార్యక్రమాన్ని నిర్వహించింది. అది ఏపిమాస్ పాలకవర్గ మాజీ సభ్యులు, అవిభక్త ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ప్రత్యేక ముఖ్యకార్యదర్శిగా పనిచేసిన కీర్తిశేషులు స్మరజిత్ రే స్మారక ప్రసంగం.



ఈ కార్యక్రమంలో ప్రణాళికా సంఘం మాజీ సభ్యులు, భారత్ గ్రామీణ జీవనోపాధుల సంస్థ (బి ఆర్ ఎల్ ఎఫ్) అధ్యక్షులు అయిన డాక్టర్ మిహిర్ షా 'భారతదేశ జల విధానం లో సమూల మార్పుల అమలుకు ఎదురయ్యే సవాళ్ళు' అనే అంశంపై ప్రధాన ప్రసంగంచేశారు. ఏపిమాస్ పాలకవర్గ ఉపాధ్యక్షురాలు శ్రీమతి నందితా రే అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇంకా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రణాళికా శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీ సంజయ్ గుప్త, సెస్ ప్రతినిధి డాక్టర్ గోపీనాథరెడ్డి,ఏపిమాస్ ఎండి శ్రీ సి ఎస్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి కళామణి పాల్గొన్నారు.

శ్రీమతి కళామణి వేదికపైకి అతిథులను ఆహ్వా నించిన అనంతరం శ్రీ సి ఎస్ రెడ్డి స్వాగతోపన్యాసం చేస్తూ, స్మరజిత్ రే తో ఏపిమాస్‌కు వున్న అనుబం ధాన్ని గురించి, ఆయనకు గ్రామీ ణాభివృద్ధి పట్ల, పేదరిక నిర్మూలన పట్ల వున్న అంకిత భావం, శ్రద్ధా సక్తుల గురించి వివరించారు. ఆయన స్మృతికి నివాళిగా ఏపిమాస్ ప్రతి ఏటా స్మరజిత్ రే స్మారకోప న్యాసాలను నిర్వహిస్తున్నదని, గతంలో రిజర్వ్ బ్యాంక్ అప్పటి గవర్నర్ శ్రీ వై.వి.రెడ్డి, శ్రీమతి శాంతా సిన్హా, శ్రీ రాజేష్ టాండన్ మొదలైనవారు స్మారకోపన్యాసాలు చేశారని తెలిపారు.నీటి సంక్షోభ పరిష్కారం స్మరజిత్ రే కు ఆసక్తికరమైన అంశమని అందుకే ఈ అంశాన్ని ఎంపికచేశామని చెప్పి, మిహిర్ షా గురించి, గ్రామీణాభివృద్ధిరంగంలో బిఆర్ఎల్ఎఫ్ అనే సంస్థను నెలకొల్పి ఆయన చేస్తున్న అసామాన్య మైన సేవలను గురించి వివరించారు.అనంతరం వేదికపైవున్న ప్రముఖులు స్మరజిత్ రే చిత్రపటంవద్ద జ్యోతి ప్రజ్వలనచేసి, పుష్పాంజలి ఘటించారు.

**జల సంరక్షణ మిషన్**

ముందుగా శ్రీమతి నందితా రే (స్మరజిత్ రే భార్య) అధ్యక్షోపన్యాసం చేస్తూ, గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన, ప్రకృతి వనరుల సంరక్షణ రంగాలలో స్మరజిత్ రే చేసిన అవిశ్రాంత కృషిని వివరించారు.

**జాప్యం పనికి రాదు, అలానే తొందరపాటు కూడా ...**

అనంతరం డాక్టర్ గోపీనాథరెడ్డి మాట్లాడుతూ, స్మరజిత్ రే తో కలసి పనిచేసిన సంఘటనలను గుర్తుచేసుకున్నారు. ఆయనకు జల సంరక్షణ పట్ల వున్న అంకితభావాన్ని వివరిస్తూ, అందుకోసం ప్రత్యేకంగా ఒక మిషన్ ఏర్పాటుచేయాలని స్మరజిత్ రే ఎంతగానో తాపత్రయ పడ్డారని చెప్పారు. అయితే వివిధ కారణాలవల్ల ఆ మిషన్ ఇంకా కార్యరూపం దాల్చనప్పటికీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే ఏర్పాటు చేసిన ఏడు మిషన్లలో భాగంగా జల సంరక్షణ మిషన్ ఏర్పాటుకానున్నదని చెప్పారు.

**నిపుణుల నేతృత్వం**

తరువాత ప్రసంగించిన ప్రధాన వక్త డాక్టర్ మిహిర్ షా తానుకూడా భాగస్వామ్యం వహించిన 12 వ ప్రణాళిక రూపకల్పనలో చోటుచేసుకున్న పరిణామాలను వివరించారు. ఈ ప్రణాళికలో భాగంగా జాతీయ జలవిధాన రూప కల్పనకు తనను సారధ్యం వహించవలసిందిగా అప్పటి ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ స్వయంగా తనను కోరారని,అయితే ప్రభుత్వ జోక్యం వుంటే తాను పనిచేయలేనని చెప్పానని,ప్రభుత్వ జోక్యం వుండదన్న హామీ మీదనే తాను ప్రణాళికా సంఘ సభ్యత్వానికి అంగీకరించానని ఆయన చెప్పారు.అదే విధంగా, ప్రణాళికా సంఘం చరిత్రలోనే మొదటిసారిగా జలవిధాన రూపకల్పనకు సంబంధించిన కార్యాచరణ బృందాలన్నిటికి (వర్కింగ్ గ్రూప్స్) ప్రభుత్వేతర రంగాలకు చెందిన నిపుణులే నేతృత్వం వహించారని మిహిర్ షా వివరించారు. ఏపిమాస్ ఎం డి శ్రీ సి ఎస్ రెడ్డి కూడా ఒక వర్కింగ్ గ్రూప్‌కు నాయకత్వం వహించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.




**పది సూత్రాలు**

జల వనరుల యాజమాన్య సమస్య తీవ్రతను అవగాహన చేసుకున్న జలవిధాన రూపకల్పన విభాగం మామూలు మూసపోత విధానాలు సరిపోవని; సమూలమైన, అన్ని అంశాలను పునస్సమీక్షించే ఆలోచనా విధానం అవసరమనే అభిప్రాయానికి వచ్చి చర్చోపచర్చలు జరిపి పది అంశాలతో కూడిన 'సమూలమైన మార్పు' (పారాడైమ్ షిఫ్ట్) విధానాన్ని రూపొందించినట్టు మిహిర్ షా వివరించారు. ఆ పది సూత్రాలు ఇవి:

1)*సేద్యపు నీటి విధానంలో భారీ మార్పులు:* సహభాగ స్వామ్యంలో ఆయకట్టు ప్రాంతాల సమగ్రాభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించడం ఆశించిన మార్పులో ప్రధానాంశం. సేద్యపు నీటి ప్రాజెక్టుల నిర్మాణంతో అంది వచ్చిన నీటి నిల్వ సామర్థ్యానికి, వాస్తవంగా చేస్తున్న నీటి వినియోగానికి పొంతన లేదు. చాలా తక్కువగా వున్న నీటి వినియోగ సామర్థ్యాన్ని కనీనం 20శాతానికి పెంచాలన్నది 12 వ ప్రణాళిక లక్ష్యం.

2) *భూగర్భ జలాల సహభాగ యాజమాన్యం:* మనదేశంలో సాగునీటి వినియోగంలో మూడింట రెండు వంతులు, గృహావసరాలకు ఉపయోగించడంలో 80% వాటాతో భూగర్భ జలాలదే ప్రధానపాత్ర. ఈ భూగర్భ జలాల మట్టం వేగంగా పడిపోతుండడం ఆందోళనకరమైన అంశం. అందువల్ల ప్రభుత్వ శాఖలు, పరిశోధన సంస్థలు, గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థలు, పారిశ్రామిక వాడలు, పౌర సంస్థలు, స్థానిక ప్రజలను భాగస్వాములుగా చేసి భూగర్భ జలాల సంరక్షణకు అనేక చర్యలు తీసుకోవలసి వుంది.

3) *భూగర్భ జలాలు,విద్యుత్ వినియోగం:* సేద్యానికి విద్యుత్ వినియోగంపై పెక్కు రాష్ట్రాలు సబ్సిడీలు ఇస్తుండడంతో పంటలసాగు మెరుగుపడినప్పటికి, భూగర్భ జలాల వినియోగం అపారంగా పెరిగిపోతున్నది. రైతుకు నష్టం చేకూరని రీతిలో ఈ ధోరణిని అరికట్టాలి. భూగర్భ జలాలకు, విద్యుత్ వినియోగానికి మధ్యవున్న లంకెను విడగొట్టాలి.

**అందం మనిషిలో, ఇతర ప్రాణులలో, పదార్ధాలలో కాదు ... చూసే మనసులో వుంటుంది**



4) *వాటర్‌షెడ్ పునర్వికాసం, భూగర్భ జలాల పునరుద్ధరణ:* వర్షచ్ఛాయా ప్రాంతాల అభివృద్ధి విషయంలో నైపుణ్యం కలిగిన మానవ వనరుల లభ్యత తగినంతగా లేదని గుర్తించడం జరిగింది. అందువల్ల అవసరమైన సామర్థ్య నిర్మాణ చర్యలతో వాటర్‌షెడ్ పునర్వికాసానికి, భూగర్భజలాల పునరుద్ధరణకు కృషి జరగాలి. 5) *గ్రామీణ మంచి నీటి సరఫరా, పారిశుద్ధ్యం:* అన్ని గ్రామాలకు, ఆవాసాలకు సురక్షితమైన మంచినీటిని అందించా లన్నది అభ్యుదయ విధానమే, అభినంద నీయమే. ఐతే, సురక్షిత నీటి సరఫరా విస్తరించేకొద్దీ భూగర్భ నీటి మట్టం స్థాయి, నీటి నాణ్యత తగ్గిపోతుండడం ప్రధాన సమస్యగా మారింది. వ్యక్తిగత మరుగుదొడ్ల బదులుగా ఆ ఆవాసంలో భూగర్భ నీటి మట్టం స్థాయిని దృష్టిలో వుంచుకుని విభిన్నమైన వ్యూహాలను అనుసరించడం అవసరం. 6)*పట్టణాలలో నీరు, వ్యర్థపదార్థాల యాజమాన్యం:* వ్యవసాయానికి, గ్రామీణ ప్రాంతాలకు నష్టం కలిగించని రీతిలో పట్టణాలలో నీటి యాజమాన్యం, వ్యర్థ పదార్థాల యాజమాన్యానికి సంబంధించిన వ్యూహాలను తిరిగి రూపొందించుకోవడం అవసరం. వీటితోపాటు *7) పరిశ్రమలలో నీటి వినియోగం 8) వరదలను అడ్డుకోవడానికి నిర్మాణాలతో అవసరంలేని ప్రక్రియలు 9) నీటి వనరులు, నీటి వినియోగానికి సంబంధించిన సమస్త సమాచారాన్ని సిద్ధంచేయడం 10) సంస్థాగతంగా, చట్టపరంగా కొత్త నిబంధనలు* అనే అంశాలగురించి కూడా డాక్టర్ మిహిర్ షా వివరంగా తెలియజేశారు. చివరిగా శ్రీ గోపీనాథరెడ్డి వందన సమర్పణ చేస్తూ ఇంత మంచి కార్యక్రమంలో తమ సంస్థను భాగస్వామిని చేసినందుకు ఏపిమాస్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఏపిమాస్ పాలకవర్గ సభ్యులు శ్రీ రామారావు, ఏపిమాస్,సాధికారత ఫౌండేషన్, సెస్, ఇతరవివిధ సంస్థలకు చెందిన పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ❐

## ఐరాస రాయబారిగా... సానియా మీర్జా

*తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్, టెన్నిస్ స్టార్ సానియా మీర్జా మరో అరుదైన ఘనత సాధించింది. మహిళా సాధికారతకు సంబంధించి ఐక్యరాజ్యసమితి సౌహార్ద రాయబారిగా సానియా నియమితులైంది. ఈ విషయాన్ని ఆమె ట్విటర్ ద్వారా వెల్లడించింది. మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా అవగాహన కల్పించేందుకు ఆమె ఈ హోదాలో కృషి చేస్తుంది. 'ఈరోజు మధ్యాహ్నం మీ అందరికీ ఓ అద్భుతమైన విషయం చెబుతాను వేచి ఉండండి' అంటూ మంగళవారం ఉదయం ఆమె చేసిన ట్వీట్‌తో అభిమానుల్లో ఉత్కంఠ పెరిగిపోయింది. సానియా ఏం చెబుతుందా అని వారంతా ఆసక్తిగా ఎదురు చూశారు. తరువాత వరుస ట్వీట్లలో తాను ఐరాస బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితులైన విషయాన్ని వెల్లడించింది.*

*దేశంలో లింగ అసమానత ఎక్కువైందని ఐరాస రాయబారిగా ఎంపికైన సానియా వాపోయింది. మహిళలను చిన్నచూపు చూస్తున్నారని, ఈ సంస్కృతిని వీలైనంత త్వరగా విడనాడాలని పేర్కొంది. ఈ విషయంలో కేవలం పురుషులే కాకుండా మహిళల ఆలోచనా ధోరణి కూడా మారాలని పిలుపునిచ్చింది. 'లింగ అసమానత గురించి అందరికీ తెలుసు. కాకపోతే కొందరు దీనిపై స్పందిస్తే మరికొందరు మిన్నకుంటున్నారు. నేను మాత్రం దీనిపై మాట్లాడాలని నిర్ణయించు కున్నా. ఏదో ఒకరోజు ప్రతి ఒక్కరూ ఒక్కటేనన్న భావన అందరిలోనూ కలుగుతున్నది నా నమ్మకం. మహిళలను వస్తువుల్లాగా చూడకూడదని అంతా గ్రహిస్తారని సానియా చెప్పింది. ఇక ప్రస్తుతం మహిళల భద్రత విషయం గురించే ఇప్పుడంతా చర్చ జరుగు తోందని,ఈ వ్యవహారంలో నిర్భయ ఉదంతం మన కళ్ళు తెరిపించిందని పేర్కొంది. ఈ ఘటన అనంతరం అసలేం జరుగుతోందన్న విషయమై దేశంలో చర్చ మొదలైందని సానియా చెప్పుకొచ్చింది.* ■

**ఆలోచించే మనసుకు దారి అదే స్ఫురిస్తుంది**

# జి4 రైతు సంఘాలచే రబీలో ప్రత్యామ్నాయ పంటలు

– జి.ఆర్.అమరేంద్ర

అనంతపురం జిల్లా కరువు కాటకాలకు నిలయమైన ప్రాంతమని మనందరికీ తెలిసిందే. ఈ జిల్లాలో ఖరీఫ్‌లో నూటికి 98% రైతులు కేవలం వేరుశనగ పంటను పండిస్తున్నట్టు గణాంకాలు తెలుపుతున్నాయి. ఈ సంవత్సరంలో (2013–14) వర్షాలు సరిగా పడకపోవడం వలనకనీసం పెట్టుబడులు కూడా రాక రైతులు కుంగిపోతున్నారు. ఈ పరిస్థితుల నుండి రైతులను ప్రత్యామ్నాయ పంటల దిశగా తీసుకెళ్ళే ప్రయత్నాన్ని ఏపిమాస్, బి.యఫ్.టి.డబ్ల్యు సంయుక్త ఆధ్వర్యంలో నల్లమాడ మండలంలో నిర్వహిస్తున్న జి4 ప్రాజెక్టు చేపట్టింది. ఆ కార్యక్రమాన్ని గురించి ప్రయత్నాన్ని తెలుసుకుందాం.

సుస్థిర సమీకృత వ్యవసాయ విధానాల అమలే లక్ష్యంగా నల్లమాడ మండలంలో గత 6–7 నెలల నుండి జి4 ప్రాజెక్టు కార్యక్రమాలు నడుస్తున్నాయి. రైతులతో, రైతు కూలీలతో కలసి పని చేయడానికి ప్రాథమిక సర్వే అనంతరం చిన్న, సన్నకారు రైతులను ఎంపిక చేయడం జరిగింది. కొన్ని గ్రామాలలో రైతులతో రైతు సంఘాలు, కూలీలతో 'శక్తి' సంఘాలు ఏర్పాటు చేసి ప్రాజెక్టు ఉద్దేశాలను, కార్యక్రమాలను వివరించి వారిలో ఆలోచనలు ప్రేరేపించి లక్ష్యాలను నిర్దేశించడం జరిగింది. ఈ కార్యక్రమాలలో భాగంగా ఏపిమాస్ సిబ్బంది రైతు సంఘాల సమావేశాలలో చర్చలు జరుగుతున్నప్పుడు వేరుశనగ పంటకు సంవత్సరం సంవత్సరానికి ఖర్చులు పెరిగిపోవడం, దిగుబడులు రానురాను తగ్గిపోవడం రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్న అంశంగా చర్చకు వచ్చింది. కొన్ని ఎంపికచేసిన గ్రామాలలో రబీ (అక్టోబర్ – జనవరి) కాలంలో వేరుశనగకు ప్రత్యా మ్నాయంగా ఏవైనా ఇతర పంటలు వేయాలన్న అభిప్రాయం వ్యక్తమైంది. ప్రత్యామ్నాయంగా ఏ పంటలు వేయాలని ఆలోచించగా, 'టింబక్టు' ఎన్జీవో క్షేత్ర సందర్శన అనుభవాన్ని బట్టి కొర్రలు, సామలు, ధనియాలు, మంచి నువ్వులు, ఆవాలు వేయాలని సమావేశం నిర్ణయించింది. గ్రూపులవారీగా ఈ మెట్ట పంటలను మంచు ఆధారంగా పండే పంటలు, నీటి ఆధారంగా పండే పంటలుగా వర్గీకరించి 30 ఎకరాలలో వేయడానికి ప్రణాళిక రూపొందింది. కావలసిన విత్తనాన్ని రైతులు పరస్పర భాగస్వామ్యంతో తెచ్చికొని తమ పొలాలలో వేసుకుంటున్నారు. మూసమాదిరిగా ఒకేరకం పంటలను వేస్తూ వచ్చిన రైతాంగం సరికొత్త ఆలోచనలతో ప్రత్యామ్నాయ పంటలు పండించే దిశగా ముందడుగు వేస్తుండడం శుభ సూచకం. వీరి విజయం తోటి రైతులకు మార్గదర్శకం కాగలదు. ❐





**జీవితం మనం ఎలా మలుచుకుంటే అలా , గతంలోనైనా, భవిష్యత్తులోనైనా, ఎప్పుడైనా....**

# విత్తనాల మొలకశాతం తెలుసుకునే పద్ధతులు

– జి.ఆర్.అమరేంద్ర

**చా**లా సందర్భాలలో రైతులు మొలకెత్తే శాతం ఎక్కువగా లేని విత్తనాలు విత్తడం వలన పంట సరిగా మొలకెత్తక పోవడం, మళ్ళీ విత్తడం కుదిరేపనికాక తక్కువ దిగుబడులతో సరిపెట్టుకోవలసి రావడం మనం గమనిస్తుంటాం. రైతులు తాము కొన్న విత్తనం ఎంత శాతం మొలకెత్తుతుందో తెలుసుకో గలిగితే ముందుగా కొద్ది పరిమాణమలో వారి ఇంటి వద్దనే ఈవిధమైన మొలకెత్తే శాతాన్ని పరీక్షించుకుని, మొలకశాతం తెలిసినందువల్ల ఏ మోతాదులో విత్తనం వాడాలో లెక్కించుకుని, ప్రధాన పొలంలో ఆమేరకు విత్తనం విత్తుకోగలుగుతారు. ఇందువల్ల అనుకొన్న విధంగా పంట దిగుబడి సాధించడమే కాక, ఒక సీజన్ కాలాన్ని నష్టపోకుండా నివారించు కోవచ్చు.



గతంలో స్త్రీలు విత్తడానికి ముందే లెక్కించిన విత్తనాలను నమూనాగా నీటికుండల క్రింద, బట్టలో, మట్టిలో వుంచి, అవి ఏ మేరకు మొలకెత్తాయో గమనించి అందుకు అనుగుణంగా పంట విత్తే వారు. ఇప్పుడు కూడా రైతులు తిరిగి అదే సాంప్రదాయికమైన మొలక శాతం పరీక్ష పద్ధతులను అవగాహన చేసుకోవలసిన అవసరం ఎంతైనా వుంది.

**మొలక శాతం పరీక్షా పద్ధతులు**

**1. మట్టికుండలలో ఇసుక లేదా మట్టితో మొలక పరీక్ష :** విత్తదలచుకున్న విత్తనాలను లెక్కించి తీసుకుని కుండలో ఇసుక లేదా మట్టివేసి అందులో నాటాలి. తగు మాత్రం నీరు పోస్తూ గమనించినట్లయితే పంట రకాన్ని బట్టి 4–5 రోజులలో మొలకెత్తుతాయి. లెక్కించి వేసిన విత్తనాలలో ఎన్ని మొలకెత్తాయో లెక్కించి, మొలకశాతం లెక్కగట్టి దాని ప్రకారం తగిన మోతాదులో విత్తనాన్ని వేయాలి.

**2. నూలు బట్టలో చుట్టి పరీక్ష :** పప్పు దినుసు పంటలకు ఈ విధానాన్ని ఉపయోగించవచ్చు. కంది, పెసర, మినుము, బొబ్బర్లు లాంటి విత్తనాన్ని లెక్క ప్రకారం తీసుకుని, ఒక గుడ్డలో చుట్టి ప్రతిరోజూ తగు మాత్రం నీళ్ళు పోస్తుంటే, 4–5 రోజులలో మొలకలు వస్తాయి. మొలక శాతాన్ని లెక్కగట్టవచ్చు.

**3. కాగితంతో మొలక పరీక్ష :** కావలసిన మేరకు కాగితాన్ని (వార్తా పత్రికను) కత్తిరించుకుని దానిని క్రింద పరిచి వేయదలచుకున్న అన్ని రకాలైన విత్తనాలను (చిన్న విత్తనాలు, చిరుధాన్యాలు,నువ్వులు, ధనియాలు, ఆవాలు మొదలగునవి) లెక్కించి పేపర్ పైన పరిచి దానిపైన దానిని కప్పేలా మళ్ళీ పేపర్ చుట్టి, కొద్దిగా నీరు చిలకరించి మెల్లగా రెండువైపులా గొట్టంలాగ త్రిప్పి రెండువైపులా రబ్బర్ బ్యాండ్ వేసి నీడలో వుంచి ప్రతిరోజూ తగు మాత్రం నీరు చిలకరిస్తుండాలి. ఈవిధంగా చేస్తే 5–7 రోజులలో విత్తనం మొలక వస్తుంది. మొలకెత్తిన విత్తనాలను, విత్తిన శాతాన్ని లెక్కించుకుని, ఆ మోతాదులో ప్రధాన పొలంలో విత్తనాన్ని విత్తుకోవాలి.

**4. నీటికుండ పద్ధతి:** ఇంటిలో నీటి కుండ క్రింద ఇసుక పోయడం గ్రామీణ ప్రాంతాలలో సర్వసాధారణం. ఈ ఇసుకలో ధాన్యాలు, చిరుధాన్యాలు, విత్తనాలను లెక్కించి వేసికొని 5–10 రోజులలో మొలకలు వస్తాయి. వీటిని లెక్కించి లెక్క ప్రకారం విత్తన మోతాదు లెక్కించి ప్రధాన పొలంలో విత్తనాన్ని వేసికొనవచ్చును. ఈ విధానంలో ప్రత్యేకంగా నీరు పోయాల్సిన అవసరం లేదు.

❐

**మంచి నేస్తం జీవితానికి దివ్యౌషధం**

# అప్పు దారి మళ్ళితే ... సాగు దారి తప్పితే ... !

– కె.సంతోష్‌చారి

**'అ**ప్పుచేసి పప్పుకూడు తగదు' అనే సామెత మనందరికి తెలిసిందేకదా! కాని,తెలిసిన విషయాన్ని పాటించక నష్టాలకు లోనవుతుంటాం, ఇబ్బందులపాలవుతుంటాం. ఆదిలాబాద్ జిల్లా , ఇచ్చోడ (మండలం) వాటర్‌షెడ్ ప్రాజెక్టు పరిధిలోని మాన్కపూర్, గుండి, గుండివాగు, మేడిగుడా గ్రామాలు, ఆవాసాలకు పిఎస్ఐ నిధులు 50 వేల రూపాయలు మంజూరు అయ్యాయి. ఈ సొమ్మును ఉత్పాదక పెంపుదల కార్యక్రమాలకు ఖర్చు చేయాలని నిర్ణయించి, లబ్ధిదారుల ఎంపికకోసం ఒక కమిటీని నియమించారు. ఆ కమిటి తీర్మానం మేరకు వాటర్‌షెడ్ పరిధిలోని 9 మంది విఓ సభ్యులు, విసిలను లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. ఈ 9 మందికి కూరగాయలు పండించడానికి విత్తనాలకోసం, ఎరువుల కోసం డబ్బులు ఇవ్వాలని విఓ, వాటర్‌షెడ్ కమిటీ సమావేశంలో తీర్మానించారు.అదే విధంగా 9 మంది రైతులకు అప్పు ఇచ్చారు.

9 మంది రైతులు విత్తనాలు, ఎరువులు తెచ్చి పంటవేశారు. కాని, ఈ సొమ్మును ఖర్చుచేసిన తీరులోని తేడాలే కొందరికి ఎక్కువ ఆదాయం రావడానికి, మరి కొందరు కొద్దిపాటి రాబడితో సరిపెట్టుకోవలసి రావడానికి కారణమైనాయి.

ఆ మైక్రో వాటర్‌షెడ్ పరిధిలోని గుండి ఆవాసానికి చెందిన ఇద్దరు రైతులు వారికి ఇచ్చిన డబ్బులను అనుకున్న కార్యక్రమానికి పూర్తిగా వినియోగించలేదు. కేవలం 1000 రూపాయల నుంచి 3050 రూపాయల వరకు మాత్రమే విత్తనాలు తెచ్చి నాటారు. వారికి ఆదాయంకూడా అలాగే కొద్దిగానే వచ్చింది.

అదే మైక్రోవాటర్‌షెడ్ పరిధిలోని మరో గ్రామం గుండి వాగుకు చెందిన శ్రీ రాంకిషన్ 5030 రూపాయలు అప్పు తీసుకుని ఆ మొత్తం డబ్బులు కూరగాయల విత్తనాలు, ఎరువులకే ఖర్చు పెట్టారు. ఆయన తనకున్న 17 గుంటలలో 15 గుంటలు మిర్చి పంట వేశారు. పంట బాగా వచ్చింది. మిర్చి పంటవల్ల 30,000 రూపాయలు ఆదాయం లభించింది. వంకాయలు పండించడం ద్వారా మరో 3,000 రూపాయలు లాభం వచ్చినట్టు రాంకిషన్ కమిటీ సమావేశంలో స్వయంగా తెలిపారు.



రాంకిషన్ వంగ, మిర్చి తోట... ఇన్‌సెట్‌లో శ్రీ రాంకిషన్

గుండివాగు గ్రామంలోనే మరో రైతు శ్రీ పవర్ బాలాజి 5030 రూపాయలు అప్పు తీసుకుని రాంకిషన్ గారి మాదిరిగా కాకుండా తమ పద్ధతిలో తాము మిర్చి నాటారు. కానీ ఆయనకు 5000 రూపాయలు మాత్రమే లాభం వచ్చింది.

ముందే చెప్పినట్టు ఎంత అప్పు తీసుకున్నామని కాదు, అనుకున్న పని కోసమే దానిని ఖర్చు పెట్టామా లేదా అనేది ముఖ్యం. ఆ ఖర్చు కూడా తగిన రీతిలో చేస్తేనే ఆశించిన ఫలితం పొందగలుగుతాం.

ఇందుకు ఈ రైతులే ఉదాహరణ! ❐

**సంతృప్తి వుంటే అన్నీ వున్నట్టే, అది లేకుంటే ఎన్ని వున్నా ఏమీ లేనట్టే**

# సాగునీటితోపాటు తాగునీటి అవసరాలను తీరుస్తున్న సేద్యపుగుంట!

– కె.సంతోష్‌చారి

**ఆ**దిలాబాద్ జిల్లా ఇచ్చోడ (మండలం) మెగా వాటర్ షెడ్‌లో 7 మైక్రో వాటర్‌షెడ్ గ్రామాలు వున్నాయి. వీటిలో మాన్కపూర్ మైక్రో వాటర్‌షెడ్ ఒకటి. ఈ మైక్రో వాటర్ షెడ్ పరిధిలో మాన్కపూర్, మేడిగూడా, గుండి, గుండివాగు, కేశవపట్నంలోని భూములను వాటర్‌షెడ్ కార్యక్రమాల అమలుకు గుర్తించారు. కేశవపట్నంలో శ్రీ ఎస్‌కె అమర్ భూమిలోని వంక ప్రక్కన సేద్యపు కుంటను (డిఒపి) తవ్వించడం జరిగింది. ఆ డిఒపికి మట్టి త్రవ్వకం, రాళ్ళ తెట్ట పనులకు 71,782 రూపాయలు ఖర్చు అయినవి. (అంచనా 76,565 రూపాయలు).



నిండుగా నీటితో కళకళలాడుతున్న సేద్యపు గుంట

ఈ సేద్యపుకుంట ద్వారా కేశవపట్నం గ్రామ వాసులకు వేసవిలో త్రాగునీటి కష్టాలు చాలావరకు తీరాయి. ఇంతకుముందు కేశవపట్నం ప్రజలకు వేసవిలో త్రాగునీరు లభించక చాలా కష్టంగా ఉండేది. కాని ఇక్కడ వాటర్‌షెడ్ అమలు సంస్థ అయిన ఏపిమాస్, ఐడబ్ల్యుఎంపి తోడ్పాటుతో త్రవ్వించిన 3 మీటర్ల లోతు సేద్యపు కుంటకు దిగువన ఈ గ్రామస్తులు మరొక గుంత తవ్వుకున్నారు. ఆ గుంటలోకి 'మార్చి' నెలలో నీరు వచ్చింది. ఇలా త్రవ్విన గుంట లోని నీటిని ఆ గ్రామంలోని మొత్తం 40 కుటుంబాల వారు త్రాగునీటిగా వాడు కున్నారు. ఈ విధంగా వేసవిలో కేశవపట్నం ప్రజల త్రాగునీటి అవసరాలను చాలావరకు ఈ సేద్యపుగుంట తీర్చగలిగింది. ప్రస్తుతం డిఒపి పూర్తిగా నీటితో నిండివుంది. ఆ గ్రామ ప్రజలు త్రాగు నీటికి, ఇతర నిత్యావసరాల కోసం వాడుకోవడంతో పాటు ఆ నీటిని ఆయిల్ ఇంజన్ ద్వారా పత్తి పంటకు సరఫరా చేసు కున్నారు. ఇన్ని విధాలుగా ఆ సేద్యపుగుంట ఆ గ్రామస్తుల నీటి అవసరాలను తీరుస్తున్నది. సాగు నీటికోసం మొదలై తాగు నీరు కూడా యిస్తున్నది. ❐

**– కె.సంతోష్‌చారి, మాన్కపూర్ మైక్రో ప్రాజెక్టు, ఇచ్చోడ**



నీరు చేరక ముందు సేద్యపు గుంట

**నీవు మానసికంగా కుంగిపోతే సమస్య తన ప్రతాపాన్ని చూపిస్తుంది**

# వికలాంగుల కార్యవర్గ నిర్వాహకులకు స్వయం నియంత్రణపై శిక్షణ

– హరిలాల్, మహేందర్

ఏపిమాస్‌కు చెందిన సాధికారత ఫౌండేషన్, కమిట్‌మెంట్స్ సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో మహబూబ్‌నగర్ జిల్లాలోని 7 మండలాల్లో మండల వికలాంగుల కార్యవర్గ నిర్వాహకులకు (ఎంవిఎస్ లకు) 2014 అక్టోబర్,నవంబర్ నెలలలో శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణ ప్రతి మండలంలో రెండురోజుల పాటు సాగింది.

వికలాంగ సమాఖ్యలు, సంఘాలు స్వయం సమృద్ధిని సాధించి, సుస్థిరంగా మనుగడ సాగించాలంటే వాటికి కొన్ని నియమ నిబంధనలు, కట్టుబాట్లతో కూడిన స్వయం నియంత్రణ అవసరం. వికలాంగ సమాఖ్యలు, సంఘాలు ఈ స్వయం నియంత్రణపై అవగాహన పెంపొందించుకుని, ఆ నియమ నిబంధనలను పాటించే విధంగా సాధికారత ఫౌండేషన్ వివిధ అంశాల మీద యంవిఎస్‌లకు శిక్షణ ఇచ్చింది.

ఎ) ♦ సంఘాలకు ఉండవలసిన లక్షణాలు
- ♦ సంఘాల కట్టుబాట్లు
- ♦ సమస్య – పరిష్కారం
- ♦ సంఘ నిర్వహణలో తీసుకోవలసిన జాగ్రత్తలు

బి) ♦ సమాఖ్యల నిర్వహణకు నిధుల ఆవశ్యకత
- ♦ నిధుల సమీకరణ
- ♦ నిధుల వినియోగం
- ♦ నిధుల సంరక్షణ

ఈ అంశాల గురించి శిక్షణ ఇవ్వడమే కాకుండా ప్రజాస్వామ్య నాయకత్వం ఆవశ్యకత గురించి వివరించి, సంఘాలలో నిర్ణయాలు తీసుకునే సందర్భంలో ఏవిధంగా నిర్ణయాలు తీసుకోవాలో వివరించి, వికలాంగుల సంఘాలు, సమాఖ్యల పర్యవేక్షణ, వారి సభ్యులు, కార్యనిర్వాహకుల సమస్యల గురించి, వాటి పరిష్కారాల గురించి ఈ రెండు రోజుల శిక్షణలో అవగాహన కలిగించే కృషి జరిగింది.

- ■ సభ్యుల వైఖరి గురించి
- ■ ప్రవర్తన మార్పు గురించి కూడా శిక్షణలు ఇవ్వడం జరిగింది.

వివిధ అవసరాల నిమిత్తం తమ సంఘాలలో ఆర్థిక నిర్వహణ ఏవిధంగా చేసుకోవాలో తెలియచేస్తూ వివిధ రకాల సేవల గురించి వివరించడం జరిగింది. అవి:

- ■ సమీకృత సేవలు
- ■ ప్రభుత్వ సేవా సంస్థల సేవలు



- ■ ఆర్థిక సంఘాలు, స్థానిక సంస్థల సేవలు
- ■ పంచాయతీ, మండల పరిషత్ సేవలు
- ■ స్థానిక స్వచ్ఛంద సంస్థల సేవలు
- ■ ఇతర సంస్థల సేవలు

ఈ శిక్షణలకు మహబూబ్‌నగర్ జిల్లాలో 7 మండలాల నుంచి మొత్తం 231 మంది యంవిఎస్ కార్యవర్గ సభ్యులు హాజరైనారు. ప్రతి యంవిఎస్ మండలంలో 2 రోజుల చొప్పున మొత్తం 14 రోజుల పాటు శిక్షణ సాగింది.

సాధికారత ఫౌండేషన్ సిబ్బంది, శ్రీ నవీన్ కుమార్, శ్రీ వెంకటేష్, శ్రీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం జరిగింది. ❐

**మనం డబ్బు మాదిరిగానే జీవితాన్నీ వెచ్చిస్తాం అయితే మంచికోసమా, చెడుకోసమా అనేదే వ్యక్తిత్వానికి నిదర్శనం**

# తెలంగాణాలో మహిళల భద్రతకు విస్తృతంగా చర్యలు

**అన్ని జిల్లాల్లో షి టీమ్స్ : టోల్ ఫ్రీ నంబర్ : ప్రతి ఠాణాలో మహిళా విభాగం**

**తె**లంగాణా రాష్ట్రంలో మహిళల భద్రత, మహిళలకు సంబంధించిన సమస్యల సత్వర పరిష్కారం కోసం 24 గంటల పాటు పనిచేసే హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి శ్రీ కె.చంద్రశేఖరరావు అధికారులను ఆదేశించారు. ఈ హెల్ప్‌లైన్‌తో పాటు, ప్రస్తుతం హైదరాబాద్‌లో విజయవంతంగా అమలు చేస్తున్న షీ టీమ్స్‌ను అన్ని జిల్లాల్లోనూ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పోలీసు శాఖలోని అన్ని స్థాయిల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, ప్రతి పోలీస్ స్టేషన్‌లో కచ్చితంగా మమిళా విభాగం పని చేయాలని సిఎం సూచించారు.

ఈవ్ టీజింగ్ నియంత్రణకు ప్రస్తుతం ఉన్న ఐటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. మహిళల సమస్యలు – పరిష్కార మార్గాలు అనే అంశంపై అధ్యయనం చేసిన శ్రీమతి పూనం మాలకొండయ్య నేతృత్వంలోని మహిళా భద్రత కమిటీ చేసిన ప్రతిపాదనలను సమీక్షించిన ముఖ్యమంత్రి పై విధంగా ఆదేశించారు. ఈవ్‌టీజింగ్ నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై కమిటీ ప్రభుత్వానికి పలు సూచనలు చేసింది. బస్సులు, బస్టాపులు, జనం రద్దీగా వుండే ప్రాంతాల్లో ఆకతాయిల వేధింపులను అరికట్టేందుకు అమలు చేస్తున్న కార్యక్రమాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈవ్‌టీజర్లను గుర్తించడానికి నిఘా పెట్టామని, ఈవ్‌టీజర్ల ఫొటోలు తీస్తున్నామని, వేలిముద్రలు కూడా సేకరిస్తున్నామని చెప్పారు. అంతేకాకుండా ఈవ్‌టీజర్ల తల్లి దండ్రులకు, కళాశాల యాజమాన్యాలకు కూడా లేఖలు రాస్తున్నట్లు వెల్లడించారు. హైదరాబాదులో కోఠీ, మెహదీపట్నం, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో ఈవ్‌టీజింగ్ ఎక్కువగా జరుగుతున్నదని గుర్తించినట్లు అధికారులు చెప్పారు.

**సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి....**

జనం రద్దీ ఎక్కువగా వుండే ప్రాంతాల్లో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. హైదరాబాద్‌లోని ఆర్టీసీ బస్సుల్లో ముందువైపు మహిళలు. వెనుకవైపు పురుషులు ఎక్కి దిగేలా చూడాలన్నారు. కండక్టర్ రెండువైపులా తిరిగే విధంగా మధ్యలో స్లైడర్ ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళలకు సమాజంలో ఏమాత్రం గౌరవం దక్కడం లేదని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల భద్రత ప్రతి ఒక్కరికి సంబంధించిన అంశమని, వారి గౌరవాన్ని కాపాడడం, వారి భద్రత కోసం తీసుకుంటున్న చర్యలపై విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం వుందన్నారు. షార్ట్‌ఫిల్మ్‌లు, అడ్వర్టయిజ్‌మెంట్ల ద్వారా ప్రచారం చేయాలని సూచించారు. ఆటోరిక్షాలు, ట్యాక్సీల నిర్వహణను కూడా చాలా జాగ్రత్తగా పరిశీలించాలని, వాటి యజమానులు, డ్రైవర్ల వివరాలు పోలీసుల వద్ద ఉండాలని,ఎప్పటికప్పుడు పరిస్థితిపై ఆరా తీయాలని చెప్పారు.

**షి ఆటోలు, ట్యాక్సీలు...**

హైదరాబాద్‌తో పాటు వివిధ నగరాలు, పట్టణాల్లో షి ఆటోలు, ట్యాక్సీలు నడపాలని ముఖ్యమంత్రి సూచించారు. మహిళా డ్రైవర్లకు 50 శాతం సబ్సిడీపై వాహనాలను

## నక్సల్‌పై పోరుకు మహిళా కమాండోలు

***మ**గవాళ్ళతో సమానంగా అన్ని రంగాల్లో దూసుకెళ్తున్న మహిళలు... ఇప్పుడు నక్సల్‌పై పోరుకు కూడా సిద్ధమయ్యారు. దేశచరిత్రలోనే నక్సల్స్‌పై పోరుకు ప్రత్యేక మహిళా కమాండో దళాలను వినియోగించనున్నట్లు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) ప్రకటించింది. దీంతో ప్రత్యక్ష పోరాటాల్లో మహిళా కమాండోలను ఉపయోగించే అతి కొద్ది దేశాల జాబితాలో చేరనుంది. అడవుల్లో పోరాటానికి దిగనున్న ఈ మహిళా కమాండోలకు సీఆర్‌పీఎఫ్ దళాలుపయోగించే యూనిఫాంనే ఎంపిక చేశారు.* ■

**పిరికివాళ్ళు దినదిన గండంగా రోజులు వెళ్ళదీస్తారు, ఆనందంగా జీవించలేరు**

సమకూరుస్తామని వెల్లడించారు. భ్రూణహత్యలను నిరోధించేందుకు, ఆడపిల్లలను చంపడాన్ని అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. గుడుంబా వల్ల చాలామంది చనిపోతున్నారని, 25–30 ఏండ్ల యువతులే వితంతవులుగా మారాల్సి వస్తున్నది చెప్పారు. గుడుంబా, నాటు సారాను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై కూడా అధ్యయనం జరపాలని సీఎం ఆదేశించారు.

రెస్క్యూ హోంలలో ఉంటున్న అమ్మాయిలు, యువతులు, మహిళల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారి పోషణ కోసం ప్రస్తుతం నెలకు ఇస్తున్న రూ.750 సరిపోవడం లేదని, ఇంకా పెంచాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

అన్ని రంగాల్లో మహిళలకు పురుషులతో సమానమైన వేతనాలు అందించాలని, వివక్ష చూపితే హెల్ప్‌లైన్ ద్వారా పరిష్కరించాలని చెప్పారు. ప్రభుత్వంలోని అన్ని శాఖలలో మహిళలకు ప్రసూతి సెలవులు ఇవ్వడంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు.

మహిళల కోసం పనిచేసే వివిధ సంస్థలు, వ్యక్తులు, అధికారులను సమన్వయ పర్చుకుంటూ హెల్ప్ డెస్క్ ప్రభావవంతంగా పని చేయాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో విజయవంతంగా అమలుచేస్తున్న షీ టీమ్స్‌ను ప్రతి జిల్లాలోనూ ఏర్పాటు చేయాలని సూచించారు. హైదరాబాద్‌లో మహిళల భద్రత కోసం చేపడ్తున్న కార్యక్రమాలను జిల్లాలకు కూడా విస్తరించాలని, ప్రతి జిల్లాలో ఓ డిఎస్పీ స్థాయి అధికారికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించాలన్నారు.

పోలీసుశాఖలోని అన్ని స్థాయిల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, ప్రతి పోలీస్‌స్టేషన్‌లో కచ్చితంగా మహిళా విభాగం పని చేయాలని సీఎం ఆదేశించారు.

హైదరాబాద్‌లోని డీఎంఏ ల్యాబరేటరీని బలోపేతం చేస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. జిల్లాల్లో ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామన్నారు. సెల్‌ఫోన్, ఇంటర్నెట్, ఫేస్‌బుక్, ట్విట్టర్‌లాంటి సమాచార సాధనాల ద్వారా మహిళలను వేధిస్తున్నారని, దీనిని అరికట్టడానికి ఐటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సీఎం ఆదేశించారు. చైనా, గల్ఫ్ దేశాల మాదిరిగా సోషల్ మీడియాపై నియంత్రణ ఉండే అవకాశాలను పరిశీలించాలన్నారు.

## దీపం పథకానికి మార్గదర్శకాలు

*దీపం పథకం కింద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంజూరు చేసిన 3 లక్షల వంట గ్యాస్ కనెక్షన్లను జిల్లాలవారీగా కేటాయించారు. 2014-15 ఏడాదికి సంబంధించిన వీటిని వివిధ జిల్లాలకు కేటాయిస్తూ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనరు బి.రాజశేఖర్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. హెచ్‌పీసీ నుంచి 1,50,420 కనెక్షన్లు, ఐఓసీ నుంచి 1,01,640, బీపీసీ నుంచి 47,940 కనెక్షన్లను అందించేలా ప్రణాళికలు రూపొందించారు.*

*నూతన మార్గదర్శకాల ప్రకారం రాయితీ వంట గ్యాస్ కనెక్షన్లను దారిద్ర్యరేఖకు దిగువన వున్న మహిళలకు ఇస్తారు. వీరిలోనూ వితంతు, వికలాంగులు, అనాథలు, అంత్యోదయ అన్నయోజన, అన్నపూర్ణ కార్డులు కలిగినవారు, ఎస్సీ, ఎస్టీ మహిళలకు ప్రాధాన్యం ఇస్తారు. పౌరసరఫరాల శాఖ రెవెన్యూ, చమురు కంపెనీ అధికారుల ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఎంపిక జరుగుతుంది. తుది జాబితాను కలెక్టరుకు పంపించి పరిపాలనా అనుమతి తీసుకుంటారు.*

*లబ్ధిదారుల నుంచి రేషన్ కార్డు, ఆధార్, బ్యాంకు ఖాతాల వివరాలు తీసుకొని వాటిని ఆన్‌లైన్‌లోని పౌరసరఫరాల శాఖ వెబ్‌సైట్‌లో నమోదు చేస్తారు. రాయితీ సొమ్మును బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు.* ■

### టోల్ ఫ్రీ నంబర్ 1800 70 87 87

మహిళల భద్రతకు సంబంధించి టోల్ ఫ్రీ నంబరు 1800 70 87 87 అందుబాటులోకి వచ్చింది. దీన్ని తెలంగాణ కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్‌వి చంద్రవదన్ 15-11-14న ఆవిష్కరించారు. ఈ టోల్ ఫ్రీ నంబరు ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు పని చేస్తుంది. ❐

**ఎవరైనా ఏమి మిగిల్చిపోయారని కాదు, ఎలా జీవించారనేదే ముఖ్యం**

# భ్రూణ హత్యల నివారణలో రాష్ట్రాలు విఫలం: సుప్రీంకోర్టు ఆగ్రహం

భ్రూణ హత్యలను నిలువరించడంలో వివిధ రాష్ట్రాలు విఫలమయ్యాయని సుప్రీంకోర్టు నవంబర్ 25న తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనివల్ల దేశంలో లింగ నిష్పత్తి ఆందోళనకర స్థాయిలో పడిపోతోందని పేర్కొంది. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడింది. ఆ రాష్ట్రం దాఖలు చేసిన అఫిడవిట్‌లోని వివరాలను ఎక్కడినుంచి తీసుకున్నారన్న దానిపై సరైన వివరణ లేదని వ్యాఖ్యానించింది. ఇందుకు 'క్షమాపణ' కోరాలని జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ యు.యు. లలిత్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఉత్తరప్రదేశ్, హర్యానా, ఢిల్లీలు అందించిన లింగ నిష్పత్తి డేటాకు ప్రాతిపదికగా నిలిచిన రికార్డుల తనిఖీ కోసం ఆ రాష్ట్రాల సీనియర్ అధికారులతో డిసెంబర్ 3న భేటీ కావాలని కేంద్ర ఆరోగ్యశాఖకు ధర్మాసనం సూచించింది.

భ్రూణ హత్యలకు సంబంధించి ఇప్పటివరకూ ఎంత మందిని ప్రాసిక్యూట్ చేశారో చెప్పాలని రాష్ట్రాలను ఆదేశించింది. బాలికా శిశువును రక్షించే కుటుంబాలకు వ్యక్తిగత ప్రోత్సాహకాలు ఇచ్చే ప్రణాళికేదైనా ఉందా అని కూడా తెలుసుకోగోరింది. అస్సాం, అరుణాచల్‌ప్రదేశ్; బీహార్, గోవా, గుజరాత్‌లు అఫిడవిట్‌లే దాఖలు చేయలేదని, ఇది వాటి నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని వ్యాఖ్యానించింది. రెండు వారాల్లోగా అఫిడవిట్లు సమర్పించాలని ఆ రాష్ట్రాలను ఆదేశించింది. 2011 నాటి డేటాను సమర్పించారని యూపీపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది.

**అత్యాచారం చేస్తే బాలనేరస్థుడు ఎలా అవుతాడు?**

ఒక అమ్మాయి (నిర్భయ)పై అత్యాచారానికి పాల్పడిన బాలుడు బాలనేరస్థుడు (జువైనల్) ఎలా అవుతాడని లోకాయుక్త (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) జస్టిస్ బి.సుభాషణ్‌రెడ్డి ప్రశ్నించారు. అలాంటివారిని ఎందుకు ఉరి తీయకూడదు అని అభిప్రాయపడ్డారు. కానీ చట్టంలో అలాంటి శిక్ష లేకపోవడం వల్ల నిర్భయ కేసులోని బాలుడుని వదిలేశారని వయసుకు మించిన పనులు చేస్తే పెద్దలతో సమానంగా శిక్షార్హులే వంటి సవరణలు జువైనల్ జస్టిస్ చట్టంలో తీసుకురావాలని ఆయన సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలో రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో 'మహిళా భద్రతపై కార్యాచరణ' అంశంపై సదస్సు జరిగింది.

కొద్దిరోజుల్లో జువైనల్ జస్టిస్ చట్టంలో సవరణలపై ఇక్కడి న్యాయ విశ్వవిద్యాలయంలో సదస్సు జరగబోతోందని, దానిపై మీ అభిప్రాయం ఏమిటని మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డా. త్రిపురాన వెంకటరత్నం ప్రశ్నించగా... జస్టిస్ సుభాషణ్‌రెడ్డి పైవిధంగా స్పందించారు. తెలంగాణ ప్రభుత్వం మహిళా భద్రతకు కొన్ని చట్టాలు చేస్తామని ప్రకటించడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు.

అంతకుముందు మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డా. త్రిపురాన వెంకటరత్నం మాట్లాడుతూ... మనకున్న చట్టాలన్నీ ప్రస్తుతం కోమాలో ఉన్నాయన్నారు. మహిళలపై హింస కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. ఉన్న చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తే సమస్యలను పరిష్కరించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ మండలి అధ్యక్షురాలు సుజాత యాదవ్, పలు మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ❐

### తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఏర్పాటు

*తెలంగాణ బాలబాలికల హక్కుల పరిరక్షణ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నవంబర్ 25న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిషన్‌కు ఛైర్‌పర్సన్, ఆరుగురు సభ్యులను నియమిస్తామని, అందులో ఇద్దరు మహిళలు ఉంటారని తెలిపింది. స్త్రీ శిశు సంక్షేమశాఖ ఇన్‌ఛార్జి మంత్రి అధ్యక్షతన గల కమిటీ ఛైర్‌పర్సన్, సభ్యుల ఎంపిక చేస్తుందని తెలిపింది.* ■

**అడ్డంకులెదురైనా జావగారి పోకుండా పట్టుదలగా నిలవడమే అసలైన సాహసం**

# 'స్త్రీలపై పెరుగుతున్న హింసకు వ్యతిరేకంగా పోరాడుదాం'

ఇటీవల హైదరాబాద్‌లో ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్శిటీ (ఇఫ్లూ)లో చదువుతున్న ఢిల్లీకి చెందిన విద్యార్థినిపై నలుగురు విద్యార్థులు అత్యంత అమానుషంగా సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బాధిత విద్యార్థిని తనకు జరిగిన దుర్మార్గాన్ని బయటకు చెప్పడం – ఈ ఘటనకు వ్యతిరేకంగా నిరసనాందోళనలు వ్యక్తం కావడంతో నలుగురిలో ఇద్దరిని మాత్రమే అరెస్టు చేసి రిమాండ్‌కి పంపినట్లు వార్తలొచ్చాయి. గతంలో ఇదే యూనివర్శిటీలో విద్యార్థుల ఆత్మహత్యలు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో దళిత విద్యార్థుల ఆత్మహత్యలు, ఇతర విద్యార్థులపై దాడులు జరిగాయి. ఇవన్నీ దేన్ని సూచిస్తున్నాయి? ఇతర దేశాల నుంచి, రాష్ట్రాల నుంచి మారుమూల గ్రామాల నుంచి మహానగరాలకు చదువుకోవడానికి వస్తున్న విద్యార్థినీ విద్యార్థులకు కాలేజీల్లో, విశ్వవిద్యాలయాల్లో ఏమాత్రం భద్రత లేదన్న వాస్తవాన్ని ఈ ఘటనలు వెల్లడి చేస్తున్నాయి.

దేశంలోని వివిధ యూనివర్శిటీలలో అభివృద్ధి నిరోధక శక్తులు పెచ్చరిల్లుతున్నాయి. భారతీయ సంస్కృతి ఉద్ధారకులమని చెబుతూ స్త్రీల నైతికతను నిర్దేశిస్తూ భూస్వామ్య, పితృస్వామ్య భావజాలాన్ని కీర్తిస్తున్నారు. వివిధ పద్ధతుల్లో దాడులు చేస్తున్నారు. స్త్రీల అభివృద్ధికి నిజమైన స్వేచ్ఛకి, ఆత్మగౌరవానికి వ్యతిరేకంగా వస్తున్న ఇలాంటి ధోరణులు యువతలో సరైన చైతన్యం పెరగకుండా, ప్రత్యామ్నాయ ప్రజాస్వామిక సాంస్కృతిక విలువలు వేళ్ళూనుకోకుండా పక్కదారి పట్టిస్తున్నాయి. మహిళలపై తీవ్రమవుతున్న హింసాకాండను ప్రభుత్వాలు విడివిడి ఘటనలుగా చూపుతూ సమస్య తీవ్రతకు గల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక కారణాల వైపు చర్చని రానివ్వడం లేదు. తీవ్రమైన నిరసన వ్యక్తమైన సందర్భాల్లో అరెస్టు చేసి కేసులు పెట్టడం, ఒకటో రెండో శిక్షలు వేయడం ద్వారా నేరాల్ని అదుపు చేస్తామని, మహిళలకు రక్షణ కల్పిస్తామని చెబుతున్నాయి. చట్టాలు, టీమ్‌లు మహిళలకు పూర్తిస్థాయి భద్రతను కల్పించలేకపోతున్నాయనడానికి దేశవ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమవుతున్న అత్యాచారాలే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. స్త్రీలపై హింస, అత్యాచారాలు, హత్యాకాండ సాగడానికి గల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక కారణాల్ని లోతుగా అర్థం చేసుకోవాల్సి ఉంది. వ్యవస్థీకృత దోపిడీ, పితృస్వామిక మూలాల్ని వదిలిపెట్టి సమస్యకి పరిష్కారాన్ని చట్టం–నేరం–శిక్ష చుట్టూ తిప్పడం వెనుక పాలకులకు స్పష్టమైన ప్రయోజనాలు ఉన్నాయి. తమ దోపిడీ ప్రయోజనాల్ని రక్షించుకునేందుకు ఈ అప్రజాస్వామిక విలువల్ని, విష సంస్కృతిని పెంచి పోషిస్తున్నాయన్న వాస్తవాన్ని మనం గుర్తించాలి. కోట్లాదిమంది శ్రమజీవులపై సాగుతున్న దోపిడీని మహిళలు, యువతరం అర్థం చేసుకుని విముక్తి చైతన్యం వైపుగా ఆలోచించాలి.

ఉన్నతమైన మానవ విలువల కోసం, నిజమైన ప్రజాస్వామిక సంస్కృతి కోసం, స్త్రీ పురుషుల మధ్య వుండాల్సిన ప్రజాస్వామిక, సమానత్వ విలువల వ్యాప్తి కోసం ఉద్యమ కార్యాచరణ సాగించాల్సిన అవసరం వుంది. స్త్రీలపై కొనసాగుతున్న వ్యవస్థీకృత హింస, పితృస్వామిక పీడన, భూస్వామ్య, సామ్రాజ్యవాద దోపిడీ విష సంస్కృతులకు వ్యతిరేకంగా మహిళలు, విద్యార్థులు, యువత, ప్రజాస్వామిక శక్తులు, ప్రజలు పోరాడాలి. ❑

## 'ఆసరా'కు ఆదాయ పరిమితి పెంపు

*తెలంగాణాలో ఆసరా పింఛన్ల పథకానికి ఆదాయ పరిమితి పెంపుపై నవంబర్ 25న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్వయం ఉపాధిని పొందే చేతివృత్తులవారు, చిరు వ్యాపారులకు దీన్ని వర్తింపచేయాలని ఆదేశించింది. పింఛన్ల పథకానికి గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయ పరిమితి 1.50 లక్షల రూపాయలకు, పట్టణ ప్రాంతాల్లో ఆదాయ పరిమితిని రూ. 2 లక్షలకు పెంచుతూ ఇటీవల ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిపై తాజాగా ఉత్తర్వులిచ్చింది. దరఖాస్తుదారులు ఈమేరకు తహిసిల్దార్ల నుంచి తీసుకున్న ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే వారిని ఎంపిక చేయాలని సూచించింది.* ■

**కోపం వున్న చోట ముప్పు కాచుకొని వుంటుంది , తనకోపమె తన శత్రువు, తన శాంతమే రక్ష** – స్త్రీ విముక్తి సంఘటన

# ఆహార పదార్థాలలో కల్తీని కనుగొనడం ఎలా ?

**ఆ**హార పదార్థాలలో కల్తీ జరుగుతున్నట్లు తరచూ వింటుంటాం. చట్టాలు వున్నాయి. వీటిని అమలు జరిపే ప్రభుత్వ యంత్రాంగం వుంది. కాని ప్రజలు కూడా హక్కులతో బాటు తమ బాధ్యతలను గుర్తించి కల్తీలపై అవగాహన పెంచుకుని, కల్తీల నివారణకు ప్రభుత్వ యంత్రాంగానికి తమ సహాయ సహకారాలందించాలి. అసలు కల్తీ ఎలా జరుగుతుంది, ప్రభుత్వ యంత్రాంగం ప్రజల సహకారంతో దీన్ని ఏవిధంగా నిర్మూలించాలి అనే విషయాన్ని పరిశీలిద్దాం.



**ఆహార పదార్థాలలో కల్తీ**

ఆహార పదార్థాలలో మూడు కారణాల వల్ల కల్తీ జరుగుతుంది. (1) వ్యాపారుల మోసం వల్ల (2) ప్రజల అజాగ్రత్త వల్ల (3) ప్రజల అజ్ఞానం వల్ల. వివరాల్లోకి వెళదాం.

**1. వ్యాపార మోసం వల్ల జరిగే కల్తీ**

- పాలల్లో నీళ్ళు కలపడం
- పాలకోవాలో మైదాపిండి
- నెయ్యిలో వనస్పతి
- కాఫీపొడిలో చికోరి లేక కాల్చిన చింతగింజల పొడి
- టీ పొడిలో ఒకసారి వాడి ఎండబెట్టి రంగు వేసిన పొడి
- మిరపపొడిలో రంగు కలిపిన తవుడు లేక రంపపు పొట్టు
- శనగపప్పులో లంకపప్పు
- వంట నూనెలలో చౌకబారు నూనెలు
- తేనెలో పంచదార పాకం (బెల్లం పాకం)
- మిరియాలలో బొప్పాయి గింజలు

ఇటువంటి కల్తీలు సాధారణంగా రుచి, వాడుక అనుభవం వల్ల తెలుసుకోవచ్చు. ఇలాంటి కల్తీ జరిగినట్టు అనుమానం కలుగగానే ప్రభుత్వ యంత్రాంగం చర్య తీసుకుంటుందో లేదో అనే సంశయంతో నిర్లక్ష్యం చేయ కుండా మనం మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌కు గాని, పంచాయతీ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కు గాని, ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు గాని వ్రాతపూర్వకంగా తెలియపరచాలి.

**2. అజాగ్రత్త వల్ల కలిగే కల్తీలు**

- ఆహార పదార్థాలు కలుషితమై ప్రజలను ప్రమాదాలకు గురి చేసిన ఎన్నో ప్రమాదకరమైన సంఘటనలు తరచూ, వార్తాపత్రికలో చదువుతూ వుంటాం. వీటిలో చాలా భాగం కళాయి సరిగా పెట్టని రాగి, ఇత్తడి పాత్రలలో పులిహోర, పలావు, పులుసు వంటివి వండుట వల్ల అంతే కాకుండా ఇటువంటి పాత్రలలో నిమ్మరసం, నిమ్మ ఉప్పు, చింతపండు, చింతకాయలు, మామిడికాయ ముక్కలు వంటి ఆమ్ల జనితాలైన దినుసులు వేసిన పదార్థాలు వండటం వల్ల కూడా ఇట్టి ప్రమాదాలకు ఆస్కారముంది. అందువల్ల అటువంటి పాత్రలకు దట్టంగా కళాయి పట్టించు కోవాలి.
- స్కూలు బయట సాధారణంగా తినుబండా రాలు మూతమూయకుండా రోడ్ల మీద అంగళ్లలోనూ పెట్టి అమ్ముతుంటారు. వాటి మీద దుమ్ము, ఈగలు సూక్ష్మ క్రిములు వాలి అంటురోగాలకు దారి తీస్తాయి. వీటిని కొని తినకుండా పిల్లలను పెద్దలు హెచ్చరించాలి.
- వంట వండేటప్పుడు వంట అయిన వెంటనే పదార్థాల మీద మూతలు పెట్టి వుంచాలి. పిల్లులు, నలికిరి పాములు, జిర్రెలు ఆహార పదార్థాలలో పడి ఉడికి ప్రమాదాలు తెచ్చిన సందర్భాలున్నాయి.
- వ్యవసాయదారులు, క్రిమికీటక సంహారిణులైన ఎండ్రిన్ మాలాథియాన్ వంటి విషపదార్థాలను కొని తెచ్చిన గోనె

**వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స కంటె, అది రాకుండా జాగ్రత్త పడడం మంచిది**

సంచులను అవి ఖాళీ అయిన వెంటనే వాటిని పరిశుభ్రంగా దులిపి, నీటిలో బాగా నాన బెట్టకుండానే పచారీ దుకాణం దారులకు విక్రయిస్తారు. ఆ సంచుల్లో గోధుమపిండి వంటి వాటిని వర్తకులు నింపి ప్రజలకు అమ్మగా ఆ కలుషిత ఆహారం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశాలున్నాయి.



దీనిని వ్యవసాయదారులు, వర్తకులూ గుర్తించాలి.

మనం సాధారణంగా వాడే ఆహార పదార్థాలలో హానికరమైన పదార్థాలు కలవడం వల్ల ఆరోగ్యానికి కలిగే నష్టాలను దిగువ తెలియచేయడం జరిగింది.

## కల్తీ పదార్థాల వలన కలిగే వ్యాధులు

| ఆహార పదార్థాలు | కల్తీకి ఉపయోగించే పదార్థాలు | నష్టాలు |
|---|---|---|
| 1. ఆవనూనె | బ్రహ్మదండి గింజనూనె | కంటిచూపు పోవడం, గుండెజబ్బులు, బెరిబెరీని పోలిన జలోదరం కాలేయానికి హాని కలగడం |
| 2. కొబ్బరి నూనె, బాదం నూనె వంటనూనెలు | ఖనిజాల నూనె | క్యాన్సర్‌కు దారితీసే కార్సినోజినల్ వ్యాధులు |
| 3. కంది, శనగపిండి, పసుపు | కేసరిపప్పు, పసుపుపచ్చని లెడ్‌క్రోమెట్ | పక్షవాతం<br>రక్తహీనత, మూర్ఛరోగం, గుడ్డితనం |
| 4. తీపివస్తువులు | తినకూడని రంగులు | కాలేయానికి హాని |
| 5 పానీయాలు, ఆల్కహాలు | విషపూరితమైన పదార్థాలు | క్యాన్సర్ |
| 6. మిరపపొడి | రంపంపొట్టు మొదలైనవి | గుడ్డితనం మరణం |
| 7. ఇతర మసాలా దినుసులు | | ఉదరకోశ వ్యాధులు |

### కల్తీని కనుగొనే పరీక్షలు

ఆహార పదార్థాల కల్తీని కనుగొనడానికి కొన్ని చిన్న పరీక్షలు ఉన్నాయి. ఆహార పదార్థాలు స్వచ్ఛంగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని తెలుసుకోవడానికి ఈ పరీక్షలు సహాయపడతాయి. కానీ ఆహార పదార్థాలను ప్రయోగ శాలలో శాస్త్రీయపరంగా పరీక్ష జరపవలసిన అవసరముంది. ప్రయోగ శాలల నుండి అందిన నివేదిక ఫలితాల ఆధారంగా మాత్రమే ఆ వ్యాపారస్తులపై కేసు పెట్టవచ్చు. మన మామూలు ఆహార పదార్థాలు ఏవైనా కల్తీ అయ్యాయో, లేవో అన్న విషయాన్ని చిన్న పరీక్షలు తెలియచేస్తాయి. అటువంటి పరీక్షలలో కొన్నింటిని దిగువ చూపడం జరిగింది. ఈ పరీక్షలను ఇంట్లోనే సులభంగా చేయవచ్చు.



**నీ జీవితానికి ఉపయోగం ఏమిటంటే అది పదిమందికి ఉపయోగపడే జీవితం కావడమే**

| ఆహార పదార్థం పేరు | కల్తీ ఉపయోగించే పదార్థాలు | కల్తీను కనుగొనడానికి పరీక్ష |
|---|---|---|
| 1. నెయ్యి, వెన్న | వనస్పతి | ఒక టీ స్పూన్ నిండా కరిగిన నెయ్యి లేదా వెన్నను అంతే పరిమాణం గల హైడ్రోక్లోరిక్ ఒక నిమిషం పాటు బాగా కలపండి. దానిని ఆ తర్వాత అయిదు నిమిషాల పాటు ఉండనివ్వండి. పరీక్ష నాళిక క్రింద భాగంలో ఎరుపు రంగు కనబడినట్లయితే నెయ్యి లేదా వెన్నలో వనస్పతి కల్తీ అయిందన్నమాట. |
| 2. నూనెలు | | |
| ఎ. వంట నూనె | ఆర్డిమెన్ నూనె<br>బ్రహ్మదండి గింజల నూనె | శాంపిల్ నూనెకు గాఢనత్రజని ఆమ్లాన్ని కలిపి జాగ్రత్తగా కలపండి. ఆమ్లంపై భాగంలో ఎరుపు రంగు లేక ఇటుక ఎరుపు రంగు కనబడితే దానిలో బ్రహ్మదండి నూనె వున్నట్లు తెలుస్తుంది. |
| బి. కొబ్బరి నూనె | ఖనిజాల నూనె | 2 మి.లీ. వంటనూనె తీసుకోండి. దానికి అంతే పరిమాణం గల ఎన్ / 2 ఆల్కహాలిక్ పొటాష్‌ను కలపండి. మరిగే నీటిలో ఈ రెండింటిని కలపండి. దానికి 10 మి.లీ. నీటిని కలపండి. ఈ మిశ్రమం మడ్డిగా అయినట్లయితే, ఖనిజాల నూనె వున్నట్లు తెలుస్తుంది. |
| సి. వంటనూనె | ఆముదం | కొంచెం నూనెను పరీక్ష నాళికలోని పెట్రోలియం ఈథర్‌లో పోయండి. దానిని ఐస్ ఉప్పు మిశ్రమంలో ఉంచండి. అయిదు నిమిషాల లోపల మడ్డి ఏర్పడినట్లయితే ఆముదం వున్నట్లు తెలుస్తుంది. |
| 3. పాలు | నీరు | లాక్టోమీటర్ రీడింగ్ 1.026 కంటే తక్కువగా వుండరాదు. పాత్రలో నుండి ఒక పాల చుక్కను మీటర్ పైన నిటారు ప్రదేశంపై వుంచండి. అది తెల్లని మరకను చేస్తూ క్రిందికి జారిపోతుంది. |
| | గంజి పిండి పదార్థాలు | కొన్ని పాలు తీసుకుని దానిలో టింక్చర్ అయోడిన్‌ను కలపండి. నీలిరంగు పైకి నూనె వున్నట్లు తెలుస్తుంది. పిండి పదార్థములు కలిపారని అనుకోవచ్చును. |
| 4. పప్పు పదార్థాలు | | |
| ఎ. కందిపప్పు | కేసరి పప్పు | సుమారు 10గ్రా కందిపప్పు 50 మి.లీ సజల హైడ్రోక్లోరిక్ ఆమ్లమును వేసి కలిపి వాటర్ బాత్‌లో 15 నిమిషముల సేపు వేడి చేయవలెను. ఎరుపు రంగు కనబడినట్లయితే కల్తీ ఉన్నట్లు తెలుస్తుంది. |

**సాధించాలని గట్టిగా అనుకోడం కన్న పట్టుదలగా మొదలెట్టడం ముఖ్యం**

| ఆహార పదార్థం పేరు | కల్తీ ఉపయోగించే పదార్థాలు | కల్తీను కనుగొనడానికి పరీక్ష |
|---|---|---|
| 1. నెయ్యి, వెన్న | వనస్పతి | ఒక టీ స్పూన్ నిండా కరిగిన నెయ్యి లేదా వెన్నను అంతే పరిమాణం గల హైడ్రోక్లోరిక్ ఒక నిమిషం పాటు బాగా కలపండి. దానిని ఆ తర్వాత అయిదు నిమిషాల పాటు ఉండనివ్వండి. పరీక్ష నాళిక క్రింద భాగంలో ఎరుపు రంగు కనబడినట్లయితే నెయ్యి లేదా వెన్నలో వనస్పతి కల్తీ అయిందన్నమాట. |
| 2. నూనెలు | | |
| ఎ. వంట నూనె | ఆర్డిమెన్ నూనె<br>బ్రహ్మదండి గింజల నూనె | శాంపిల్ నూనెకు గాఢనత్రజని ఆమ్లాన్ని కలిపి జాగ్రత్తగా కలపండి. ఆమ్లంపై భాగంలో ఎరుపు రంగు లేక ఇటుక ఎరుపు రంగు కనబడితే దానిలో బ్రహ్మదండి నూనె వున్నట్లు తెలుస్తుంది. |
| బి. కొబ్బరి నూనె | ఖనిజాల నూనె | 2 మి.లీ. వంటనూనె తీసుకోండి. దానికి అంతే పరిమాణం గల ఎన్ / 2 ఆల్కహాలిక్ పొటాష్‌ను కలపండి. మరిగే నీటిలో ఈ రెండింటిని కలపండి. దానికి 10 మి.లీ. నీటిని కలపండి. ఈ మిశ్రమం మడ్డిగా అయినట్లయితే, ఖనిజాల నూనె వున్నట్లు తెలుస్తుంది. |
| సి. వంటనూనె | ఆముదం | కొంచెం నూనెను పరీక్ష నాళికలోని పెట్రోలియం ఈథర్‌లో పోయండి. దానిని ఐస్ ఉప్పు మిశ్రమంలో ఉంచండి. అయిదు నిమిషాల లోపల మడ్డి ఏర్పడినట్లయితే ఆముదం వున్నట్లు తెలుస్తుంది. |
| 3. పాలు | నీరు | లాక్టోమీటర్ రీడింగ్ 1.026 కంటే తక్కువగా వుండరాదు. పాత్రలో నుండి ఒక పాల చుక్కను మీటర్ పైన నిటారు ప్రదేశంపై వుంచండి. అది తెల్లని మరకను చేస్తూ క్రిందికి జారిపోతుంది. |
| | గంజి పిండి పదార్థాలు | కొన్ని పాలు తీసుకుని దానిలో టింక్చర్ అయోడిన్‌ను కలపండి. నీలిరంగు పైకి నూనె వున్నట్లు తెలుస్తుంది. పిండి పదార్థములు కలిపారని అనుకోవచ్చును. |
| 4. పప్పు పదార్థాలు | | |
| ఎ. కందిపప్పు | కేసరి పప్పు | సుమారు 10గ్రా కందిపప్పు 50 మి.లీ సజల హైడ్రోక్లోరిక్ ఆమ్లమును వేసి కలిపి వాటర్ బాత్‌లో 15 నిమిషముల సేపు వేడి చేయవలెను. ఎరుపు రంగు కనబడినట్లయితే కల్తీ ఉన్నట్లు తెలుస్తుంది. |

**అన్నిటికీ తలాడించడం కాదు, తప్పనిపిస్తే నిజాయితీగా విభేదించడమే అభివృద్ధికి సంకేతం**

| ఆహార పదార్థం పేరు | కల్తీ ఉపయోగించే పదార్థాలు | కల్తీను కనుగొనడానికి పరీక్ష |
|---|---|---|
| | మిఠాయి రంగు | కొంచెం కందిపప్పు తీసుకొని కొద్దిగా గాఢ హైడ్రోక్లోరి కామ్లం కలపండి. వైలేట్ రంగు మోటానిక్ ఎల్లో నీరు కలిపినా రంగు అలాగే నిలబడితే కల్తీ ఉన్నట్లు తెలుస్తుంది. |
| 5. మసాలా ద్రవ్యాలు | | |
| ఎ. పసుపు పొడి | జొన్న గోధుమ, కర్ర పెండలం, లెడ్ క్రొమేట్ | పసుపు పొడి లోని పిండి పదార్థపు కణములు ప్రత్యేక ఆకృతి కలిగి పసుపు పచ్చగా ఉంటాయి. ఇతర పిండి పదార్థపు కణములు వేరు వేరు ఆకృతులు కలిగివుంటాయి. బియ్యం పిండి ఇతర పదార్థములతో కలిపినట్లయితే మైక్రోస్కోప్ ద్వారా పరీక్షించి తేలికగా తెలుసుకొనవచ్చును. కొద్దిగా పసుపుపొడి పరీక్షనాళికలో వేసి దానికి 1:7 సల్ఫ్యూరిక్ ఆమ్లమును వేసి ఒకటి రెండు చుక్కలు, ఆల్కహాలులో కలిపిన 0.1% డైఫినైల్ కార్బజైడ్ వేయండి. వైలెట్‌రంగు వచ్చినట్లయితే పసుపుపొడి ఉన్నట్లు తెలుస్తుంది. |
| బి. పసుపు, కారం కర్రీ పౌడర్ | కృత్రిమ రంగులు | కొంచెం పొడిని తీసుకొని ఈథర్‌లో వేసి సల్ఫ్యూరికామ్లము కలపండి. ఎరుపు రంగు కనబడినట్లయితే పదార్థంలో కల్తీఉన్నట్లు తెలుస్తుంది. కొంచెం నీరు కలిపిన తరువాత కూడా రంగు పోకుండా నిలిచి ఉన్నట్లయితే రంగు కలిపారని తెలుస్తుంది. |
| సి.కారం పొడి, ధని యాలపొడి, రంపపు పొట్టు,పసుపు మొ॥వి | మెత్తటి తవుడు | కొద్దిగా పొడిని నీటిలో వేయండి. తవుడు మరియు రంపపు పొట్టు నీటిపై తేలుతాయి. |
| డి. మిరపపొడి | ఇటుకల పొడి, ఇసుకధూళి | ఒక బీకరులో క్లోరోఫామ్, కార్బన్ టెట్రాక్లోరైడ్ తీసికొని దానికి కొద్దిగా మిరపపొడిని కలపండి. ఇటుకల పొడి, ఇసుక ధూళి ఉన్నట్లయితే బీకరు అడుగు భాగమున వచ్చి చేరతాయి. |
| ఇ. ధనియాల పొడి | గుర్రపు లద్దె | కొద్దిగా ధనియాల పొడిని నీటిలో వేయండి. గుర్రపు లద్దెలు, (పేడ) నీటిలో తేలుతాయి. |
| ఎఫ్. మిరియాలు | బొప్పాయి గింజలు | ఒక గాజు బీకరులో కొంచెం మిరియాలు తీసికొని దానిలో నీరు పోయండి. మిరియాలు బీకరులో అడుగునకు, బొప్పాయి గింజలు నీటిపై భాగమునకు తేలతాయి. |

**క్షమించడం సులభం కాదు, గుండె బలం వున్నవారికే అది సాధ్యం**

| ఆహార పదార్థం పేరు | కల్తీ ఉపయోగించే పదార్థాలు | కల్తీను కనుగొనడానికి పరీక్ష |
|---|---|---|
| 6. పిండి పదార్థాలు | | |
| ఎ. గోధుమపిండి | ఇసుక, ధూళి | కొంచెం పిండికి 10 మి.లీ. కార్బన్ టెట్రాక్లోరైడ్‌ని కొంతసేపటికి పరీక్ష నాళిక అడుగు భాగములో ఇసుక, ధూళి చేరుతుంది. |
| | చాక్ పొడి | కొంచెం గోధుమ పిండిని చిన్న గాజు పాత్రలో తీసికొని దానిలో కొంచెము గాఢ హైడ్రోక్లోరికామ్లము వేయండి. పిండిలో చాక్‌పొడి ఉన్నట్లయితే పాత్రలో బుస బుసమని పొంతు కనిపిస్తుంది. |
| బి. శనగపిండి | కేసర పిండి | కొంచెము పిండిని పరీక్ష నాళికలో తీసుకుని దానికి 50 మి.లీ. సజల హైడ్రోక్లోరికామ్లమును కలిపి 15 నిమిషాలు వేడి చేయండి. గులాబి రంగు నుండి ఎరుపు రంగు పరీక్ష నాళికలో కనిపించినట్లయితే శనగపిండిలో కేసరిపిండి కల్తీ కలిసినదని చెప్పవచ్చును. |
| 7. అగ్‌మార్క్ గుర్తింపు | లేని వ్యవసాయ సంబంధిత ఉత్పత్తులు | |
| ఎ. కాఫీ | చికోరి | ఒక గ్లాసులో నీరు తీసుకొని కాఫీపొడి కొద్దిగా చల్లండి. కాఫీ పొడుము నీటిమీద తేలుతుంది. చికోరి ఉన్నట్లయితే నీటికి బ్రౌన్ రంగు వదులుకుంటూ క్రిందికి దిగటం కనిపిస్తుంది. |
| | వేయించిన ఈత గింజలు చింతగింజల పొడి | కొద్ది కాఫీ పొడిని ఫిల్టరు పేపరు మీద 1% సోడియం కార్బనేట్ ద్రావణమును చల్లండి. ఈతగింజలు పొడి, చింత గింజలపొడి ఉన్నట్లయితే ఫిల్టర్‌మీద ఎర్రరంగు కనిపిస్తుంది. |
| బి. టీ పొడి తేయాకు పొడి | చిన్న చిన్న ఇనుపరజను | కొంచెం టీ పొడిని కాగితంపై పోసి చిన్న అయస్కాంతమును ముక్కలు కాగితము క్రింద ఉంచండి. ఇనుప రజను అయస్కాంతము వద్దకు ఆకర్షింపబడుతుంది. దానిని బట్టి టీ పొడి ఇనుపరజనుతో కల్తీ చేయబడిందని తెలుస్తుంది. |
| సి. వక్క పొడి | రంపపు పొట్టు | కొంచెం పదార్థమును పరీక్ష నాళికలో తీసికొని దానిలో నీరు కలిపిన రంపపు పొట్టులాంటి పదార్థము నీటి పైన తేలుతుంది. |
| డి. సుగంధ ద్రవ్యాల పొడి | ఇసుక, ధూళి, మట్టి | కొంచెము పదార్థమును 10 మి.లీ కార్బన్ టెట్రాక్లోరైడ్‌ను వేసి 10 నిమిషాలు భాగంగా కలిపి గమనించండి. 5 నిమిషాలు తరువాత పరీక్ష నాళిక అడుగు భాగములో ఇసుక, దుమ్ము, మట్టి కనిపిస్తాయి. |

**శాంతి లేని చోట మిగతా అన్ని కలలు దగ్ధమవుతాయి**

| ఆహార పదార్ధం పేరు | కల్తీ ఉపయోగించే పదార్థాలు | కల్తీను కనుగొనడానికి పరీక్ష |
|---|---|---|
| ఎ. మిఠాయి ఐస్‌క్రీం షర్బత్ | మెటానికల్ ఎల్లో హానికరమైన కోల్టార్ డై | గోరు వెచ్చని వేడినీటిలో వస్తువు నుండి రంగును సేకరించండి.దానికి గాఢ హైడ్రోక్లోరిక్ ఆమ్లం చుక్కలను కలపండి.మెజంటా ఎరుపు రంగు కనబడినట్లయితే మెటానిల్ ఎల్లో వున్నట్లు తెలుస్తుంది. |
| 9. బెల్లం | మెటానిక్ ఎల్లో ఎరుపు | కొంచెం బెల్లం తీసుకొని దానికి 1 మి.లీ గాఢ హైడ్రోక్లోరికామ్లమును కలపండి. మెజెంటా ఎరుపు రంగు కనబడినట్లయితే దానిలో మెటానిల్ ఎల్లో ఉన్నది తెలుస్తుంది. |
| 10. పీచు మిఠాయి | రోడామిన్ – బి | పరీక్ష నాళికలో కొంచెం శాంపిల్‌ను తీసుకుని కరిగించి దానికి హైడ్రోక్లోరికామ్లము రెండు చుక్కలు కలిపి దానికి సమాన పరిమాణంలో ఇథైల్ ఎసిటేట్ కలుపవలెను.. ఇథైల్ ఎసిటెట్ పైభాగములో రంగు తేలియాడి కనిపించినట్లయితే రోడామిక్ రంగు – బి కల్తీ ఉన్నదని తెలుస్తుంది. |

**అజాగ్రత్త , అజ్ఞానం**

బిస్కట్లు, కేకులు, మిఠాయి సరుకులు, ఐస్‌క్రీములు, పుడ్డింగులు, కూల్‌డ్రింకులు వంటి వాటిలో ఆకర్షణీయంగా వుండుటకు వాటిని తయారు చేయటంలో రంగులు కలుపుట ప్రపంచమంతటా జరుగుతున్నది.



అయితే మెటానిల్ ఎల్లో (పసుపు రంగు) రోడామిన్ – బి (గులాబి రంగు) వంటి రంగులను ప్రమాదకర మగుటచే నిషేధించబడినవి. ఆహార పదార్ధములో ఉపయోగించవలసిన రంగులకు ప్రత్యేకమైన (ఐఎస్‌ఐ) మార్కు ఉంటుంది. ఆ రంగులను మాత్రమే వర్తకులు ఉపయోగించాలని చట్టబద్ధమైన నిబంధనలు ఉన్నాయి. ఆహార పదార్థాలలో వినియోగించకూడని చౌకబారు రంగులను ఇండ్లలో ముఖ్యంగా విందులో ఉపయోగించిన సందర్భములు కూడా తెలియవచ్చాయి. ఇటువంటి రంగులు ఉపయోగించినవారు చట్టరీత్యా శిక్షార్హులు. అయితే ప్రజలు కూడా ఈ హెచ్చరికను విధిగా పాటించాలి. చట్టప్రకారం ఐఎస్ఐ ఆహారం వాడాలి. చౌకబారు మిఠాయి రంగులు హానికరము.

ఆహార కల్తీ నిరోధక చట్టము 1954 అమలు జరుపుటకు ప్రభుత్వ యంత్రాంగానికి ప్రజల సహకారం అత్యవసరం. ఈవిధమైన నేరాలు పరిశోధించుటకు ప్రత్యేక రహస్య సిబ్బందిని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జిల్లాల్లోను గ్రామాల్లోను ఆయా లోకల్ హెల్త్ అథారిటీలకు , ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌లకు లిఖిత పూర్వకంగా కాని టెలిఫోన్లలో కాని నేరములకు సంబంధించిన సమాచారాన్ని అందజేయవచ్చును.

❑

**చేయి చేయి కలిపితే మామూలు మనుషులైనా మహా కార్యాలు చేయగలుగుతారు**

# మహిళల ప్యాంటీస్ తయారీ పరిశ్రమ



- డాక్టర్ మైనంపాటి శ్రీనివాసరావు

**ప్యాం**టీస్, స్లిప్స్, బ్రాలు, మహిళల అండర్‌వేర్స్ పరిశ్రమ ఉత్పత్తులు. ఈ మూడు ఉత్పత్తులను తయారుచేసి మార్కెటింగ్ చేయడం, మార్కెటింగ్ పరంగా అనుకూలంగా వుండడమే కాకుండా అధిక లాభదాయకం కూడా. కాని పరిశ్రమ ప్రారంభం వ్యయం ఎక్కువగా వుంటుంది. కనుక ప్రారంభంలో ప్యాంటీస్‌తో ప్రారంభించి, క్రమేణా మిగిలిన ఉత్పత్తులను తయారుచేయాలని సంకల్పించడం ఒక మంచి ఆలోచన అవుతుంది. అందువలన ఈ వ్యాసంలో కేవలం ప్యాంటీస్ ఉత్పత్తిని పరిగణిస్తూ పరిశ్రమ వివరాలను తెలుసుకుందాం

**పరిశ్రమ కార్యకలాపాలు**

సేకరించిన కాటన్ నిట్టెడ్ ఫ్యాబ్రిక్‌ను వివిధ సైజుల ప్యాంటీలకు అనుగుణంగా కత్తిరించడం, బేసిక్ ప్యాంటీని కుట్టడం, ఎలాస్టిక్ టేప్‌లను కుట్టడం, సైజు తెలిపే లేబుల్‌ను, నాణ్యత తెలియచేసే లేబుల్‌ను మరియు బ్రాండ్ తెలియచేసే లేబుల్‌ను వేరువేరు కుట్టుమిషన్లపై కుట్టడం, ఓవర్ లాకింగ్ చేయడం, మిగులు దారాలను తొలగించడం, ఇన్‌స్పెక్షన్ చేయడం, ఐరనింగ్ చేయడం, కార్డుబోర్డు అట్టపై ప్యాకింగ్, ప్లాస్టిక్ కవర్ ప్యాకింగ్, కార్డుబోర్డు బాక్స్ ప్యాకింగ్, 6 ప్యాంటీస్ పెద్ద ప్యాకింగ్, బల్క్ సైజ్ కార్టూన్ బాక్స్ ప్యాకింగ్, మార్కెటింగ్ పరిశ్రమ ప్రధాన కార్యకలాపాలు.

**పరిశ్రమ వివరాలు :**

ఉత్పత్తి సామర్థ్యం : ప్లెయిన్ , ప్రింటెడ్ వివిధ సైజుల ప్యాంటీలు రోజుకు 40 డజన్లు తయారీ. అనగా సంవత్సరానికి 12000 డజన్లు లేదా 1,44,000 ప్యాంటీలు.

విద్యుత్ ఆవశ్యకత : 12 హార్స్‌పవర్

**స్థిర వ్యయాలు :**

1. 12 హెచ్.పి. విద్యుత్ కనెక్షన్ కల 2500 చ.అ. భవనం లీజుపై లీజు అడ్వాన్స్ : రూ. 1,55,000/-

**2. యంత్ర పరికరాలు :**

రౌండ్ నైఫ్, స్ట్రెయిట్ నైఫ్, ఎండ్ కట్టర్, ఓవర్‌లాకింగ్ మెషీన్, ఫ్లాట్ లాక్ కుట్టుమిషన్, బాటిల్ ఐరనింగ్ సిస్టమ్, ఐరనింగ్ టేబుల్, కటింగ్ టేప్స్, స్టూల్స్ మొదలగునవి 12,60,000

3. విద్యుత్ బిగింపులు, లైటింగ్ 50,000
4. కార్యాలయ ఫర్నీచర్ + పరికరాలు 75,000
5. పాథమిక, ప్రారంభముందు వ్యయాలు 1,65,000

మొత్తం స్థిర వ్యయాలు 17,00,000

**నెలవారీ వ్యయాలు :**

1. ముడి పదార్థాలు : ప్లెయిన్, ప్రింటెడ్ కాటన్ నెట్టెడ్ ఫ్యాబ్రిక్, ఎలాస్టిక్ టేప్, లేబుల్స్, దారం మొదలగునవి.



ప్యాంట్ సగటు వ్యయం : రూ. 18/-

40×12×25రోజులు = 12,000×రూ.18 2,16,000

2. ప్యాకింగ్ వ్యయం : కార్డుబోర్డు అట్ట, ప్లాస్టిక్ కవర్, కార్డుబోర్డు ప్రింటెడ్ బాక్సు, 6 ప్యాంటీస్ ప్యాకింగ్ బాక్సు, పెద్ద కార్టూన్ బాక్సు, టెడ్ ఇతరాలు. సగటున రూ.5/- ప్రతి ప్యాంటీకి. 12000 × 5 60,000




3. జీతాలు, వేతనాలు (14) 80,000
4. విద్యుత్ వ్యయాలు 7,000
5. భవనం అద్దె 25,000
6. ఇతర నిర్వహణా వ్యయాలు 12,000

మొత్తం 4,00,000

*(తరువాయి 31వ పేజీలో)*

**ముళ్ళు లేని రహదారిలో నడక ప్రావీణ్యం ఎలా తెలుస్తుంది?**

# అధిక ఆదాయాన్ని అందించే జీడిమామిడి సాగు

**జీడి**మామిడి తోటలను వివిధ దేశాలలో వాణిజ్య సరళిలో పెంచుచున్నారు. భారతదేశం ప్రపంచ జీడిమామిడి పరిశ్రమలోను, జీడిపిక్కల ఎగుమతి, జీడి గింజల ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్నది. సుమారు 8.93 లక్షల హెక్టార్లలో పంట పండించుచూ 6.95 లక్షల టన్నుల గింజలను ఉత్పత్తి చేసి సుమారు 2,700 కోట్ల రూపాయల విదేశీమారక ద్రవ్యాన్ని ఆర్జిస్తున్నది. మన దేశపు జీడి పరిశ్రమకు దాదాపు 12 నుండి 14 లక్షల టన్నుల ముడిగింజలు అవసరం వుంటుంది. అందులో సుమారు 6 లక్షల టన్నుల జీడి గింజలను ఆఫ్రికా దేశాల నుండి దిగు మతి చేసుకుంటు న్నాము. భారతదేశపు సగటు ఉత్పాదకత ఒక హెక్టారుకు 815 కిలోలు మాత్రమే. వివిధ పరిశోధనల ఫలితంగా 2000 నుండి 2500 కిలోల ముడి గింజల ఉత్పాదక సామర్థ్యం కలిగి వున్నప్పటికీ, క్షేత్ర స్థాయిలో సగటు ఉత్పాదకత చాలా తక్కువగా ఉన్నది. మన దేశంలో జీడి గింజల ఉత్పత్తిలో మహారాష్ట్ర మొదటి స్థానంలో, రెండవ స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉన్నాయి.



జీడిమామిడి తోటలను మన రాష్ట్రంలో శ్రీకాకుళం నుండి నెల్లూరు జిల్లా వరకు గల కోస్తా తీర ప్రాంతాలు, కొండ ప్రాంతాలలో అత్యల్ప ఉష్ణోగ్రత 8 డిగ్రీల సెంటీగ్రేడు కన్నా ఎక్కువ ఉన్న ప్రదేశాలు అనువైనవి. నేలలోతు 1.5 మీ॥ కంటే హెచ్చుగా ఉండాలి. ఉదజని సూచిక 6.3 - 7.3 కలిగి, భూమిలో నీటి మట్టం 2.5 మీ. వుండి మురుగు నీటిపారుదల బాగా హెచ్చుగా ఉండాలి. జీడి తోటలకు ఎక్కువ ఉష్ణోగ్రత, వెలుతురుతో పాటు వాతావరణంలో ఎక్కువ తేమ అవసరం.

**రకాలు :** జీడిమామిడి పరిశోధనా స్థానం, బాపట్ల ఎనిమిది జీడిమామిడి రకాలను విడుదల చేసింది. బి.పి.పి. 5, 6, 8, 9 రకాల గింజలు మధ్యస్థంగాను, లావుగాను వుండదం వలన ఎగుమతికి ఎక్కువ అనుకూలంగా వుంటాయి.

బి.పి.పి.-2, వి.ఆర్.ఐ-2 , బి.పి.పి-4 గింజలు చిన్నవిగా వుండి అధిక దిగుబడి గుత్తికాపు రకాలు. మొదటిగా కాపు వచ్చే, అధిక దిగుబడి నిచ్చే గింజ సైజు పెద్దదిగా ఉండి రెండు లేక మూడు రకాల అంటు మొక్క లను మాత్రమే కలిపి రైతులు నాటు కోవాలి. బి.పి.పి-8, వెంగ్గుల-4 హైబ్రిడ్ రకాలు జాతీయ రకాలుగా గుర్తించబడినవి.

**రకాలు - లక్షణాలు :**

**బి.పి.పి-1 :** ఇది హైబ్రిడ్ రకం. దీని గింజలు మధ్య సైజుతో సగటున 5 గ్రా బరువు వుంటాయి. ఏపిల్ రంగు పసుపు. చెట్టు సగటు దిగుబడి 12 కిలోలు. పప్పు దిగుబడి 28%.

**బి.పి.పి-2 :** ఇది హైబ్రిడ్ రకం. దీని గింజలు చిన్నవిగా ఉండి సగటున 4గ్రా బరువు వుంటాయి. ఏపిల్ రంగు పసుపు. చెట్టు సగటు దిగుబడి 15 కిలోలు. పప్పు దిగుబడి 26%.

**బి.పి.పి-3 :** ఇది సింహాచలం నుండి ఎంపిక చేసిన రకం. దీని గింజలు మధ్య రకం సైజుతో 5 గ్రా. బరువు ఉంటాయి. ఏపిల్ రంగు పసుపు. చెట్టు సగటు దిగుబడి 15 కిలోలు. పప్పు దిగుబడి 26%.

**బి.పి.పి-4 :** ఇది ఈపురుపాలెం నుండి ఎంపిక చేసిన రకం. దీని గింజలు చిన్నవిగా 4.5 గ్రా. బరువు ఉంటాయి. ఏపిల్ రంగు పసుపు. చెట్టు సరాసరి దిగుబడి 16 కిలోలు. పప్పు దిగుబడి 26%.

**బి.పి.పి-6 :** ఇది ఎంపిక చేసిన రకం. దీని గింజలు మధ్య

రకం సైజుతో 6 గ్రా. బరువు ఉంటాయి. ఏపిల్ రంగు పసుపు. చెట్టు సరాసరి దిగుబడి 15 కిలోలు. పప్పు దిగుబడి 26%.

**వి.ఆర్.ఐ.-2 :** ఇది తమిళనాడు మొక్క ఎంపిక రకం. దీని గింజలు మధ్యస్థంగా ఉండి 5.1 గ్రా. బరువు ఉంటాయి. ఏపిల్ రంగు పసుపు. చెట్టు సరాసరి దిగుబడి 7.4 కిలోలు. పప్పు దిగుబడి 26%.

**వి.ఆర్.ఐ.-3 :** ఇది తమిళనాడు మొక్క ఎంపిక రకం. దీని గింజలు మధ్యస్థంగా ఉండి 7.18 గ్రా. బరువు ఉంటాయి. ఏపిల్ రంగు పసుపు. చెట్టు సరాసరి దిగుబడి 11.68 కిలోలు. పప్పు దిగుబడి 29.1%.

**బి.పి.పి-9 :** ఇది హైబ్రిడ్ రకం. దీని గింజలు మధ్య రకం సైజు కలిగి 7.2 గ్రా. బరువు ఉంటాయి. ఏపిల్ రంగు పసుపు. చెట్టు సరాసరి దిగుబడి 24 కిలోలు. పప్పు దిగుబడి 27%.

**బి.పి.పి-5 :** ఇది ఎంపిక చేసిన రకం. దీని గింజలు మధ్య రకం సైజుతో 5 గ్రా. బరువు ఉంటాయి. ఏపిల్ రంగు పసుపు. చెట్టు సరాసరి దిగుబడి 18 కిలోలు. పప్పు దిగుబడి 25%.

**బి.పి.పి-8 :** ఇది ఎంపిక చేసిన రకం. దీని గింజలు సైజు పెద్దవిగా ఉండి 8.2 గ్రా. బరువు ఉంటాయి. ఏపిల్ రంగు పసుపు. చెట్టు సరాసరి దిగుబడి 21 కిలోలు. పప్పు దిగుబడి 27%.

**వెంగ్రుల-4 :** ఇది హైబ్రిడ్ రకం. ప్రాంతీయ ఫలపరిశోధనా స్థానం, వెంగ్రుల, మహారాష్ట్ర నుండి విడుదల చేయబడినది. దీని గింజలు మధ్య రకం సైజు కలిగి 7.7 గ్రా. బరువు ఉంటాయి. ఏపిల్ రంగు పసుపు. చెట్టు సరాసరి దిగుబడి 17.2 కిలోలు. పప్పు దిగుబడి 31%.

బి.పి.పి.-1, 2, 4, 8, 9 , వి.ఆర్.ఐ.-2 రకాలు ఫిబ్రవరి, మే నెలల్లో పూత, కాపు కొస్తాయి. బి.పి.పి.-3 రకం మార్చి - మే నెలల్లో పూత, కాపుకొస్తుంది. బి.పి.పి.-6 రకం మార్చి - జూన్ నెలల్లో ఆలస్యంగా పూత, కాపు కొస్తుంది.

**జీడి అంట్ల ఎంపిక :** జీడిమామిడి తోటలను పెంచేందుకు స్థిరమైన అధిక దిగుబడినిచ్చే గింజల సైజు పెద్దదిగా లేక మధ్యస్థంగా ఉండి ,పప్పు దిగుబడి అధిక శాతమునిచ్చే నాణ్యమైన రకములను ఎంచుకొనవలెను. ఆరోగ్యవంతమైన 4నెలల వయస్సు పైబడి, 10 లేక 15 ఆకులు కలిగి ఉన్న నాణ్యమైన అంట్లను మాత్రమే పేరున్న నమ్మకమైన నర్సరీల నుండి ఎంపిక చేసి నాటుకోవాలి. అయితే అంటుమొక్కలకు మొదటి రెండు సంవత్సరాలు నీటివసతి తప్పనిసరి. మొక్కలకు వేసవిలో అధిక ఉష్ణోగ్రతలనుండి రక్షణ కల్పించాలి. స్థానికంగా లభ్య మయ్యే తాటిఆకు,కొబ్బరాకు మొదలగునవి ఉపయోగించవచ్చు.

**నాటటం :** వర్షాకాలంలో మొదటి వర్షాలు పడిన తరువాత జూన్ - జులై నెలలలో ఒకటిన్నర సంవత్సరాల వయస్సు కలిగిన నాణ్యమైన ఎంపిక చేయబడిన అంటుమొక్కలను ఎకరాకు 80 మొక్కల చొప్పున 7×7 మీ. లేక 8×4 మీ. దూరంలో 1×1×1 మీ. సైజు గుంటల్లో నాటాలి. జాగ్రత్తగా అంట్ల మొక్క వేళ్ళ చుట్టూ వున్న మట్టి విడిపోకుండా పాలిథీన్ సంచిని తొలగించి అంటు భాగం భూమికి పైన 7.5 నుండి 10 సెం.మీ ఉండేటట్లు నాటాలి. గట్టి కర్ర పుల్లను అంటు మొక్కలకు ఊతంగా కట్టాలి. అంటు కట్టిన భాగాన వున్న పాలిథీన్ దారాన్ని తొలగించి, అంటు వేరు మూలం నుండి వచ్చు పక్క కొమ్మలను తొలగిస్తూ ఉండాలి.

**నీటి యాజమాన్యం :** జీడి అంటుమొక్కలను పొలంలో నాటిన తరువాత మొదటి రెండు సంవత్సరాలు తప్పక నీటి వసతి కల్పించాలి. పిందె, కాయ పెరిగే సమయంలో నీరు పెడితే కాయ, గింజ సైజు పెరిగి దిగుబడులు పెరుగుతాయి. డ్రిప్ ద్వారా జీడిమామిడికి నీరిస్తే 60 శాతం వరకు నీటిని ఆదా చేయవచ్చు. డ్రిప్ ద్వారా 4 డ్రిప్పర్లలో కాపుకు వచ్చిన తోటల్లో చెట్టుకు 4 రోజుల వ్యవధితో డిసెంబరు రెండవ పక్షం నుండి మార్చి చివరి వరకు నీరు ఇచ్చినచో అధిక దిగుబడులు పొందవచ్చు. మార్చి తరువాత నీటి తడులు నిలిపి వేయాలి. 7×7 మీ దూరంలో నాటినపుడు షుమారుగా ఎకరాకు డ్రిప్ కొరకు అయ్యే ఖర్చు రూ. 10,000/-, మొదటి రెండు సంవత్సరాల్లో వచ్చిన పూతను తొలగించాలి. 3వ సంవత్సరం నుండి మాత్రమే కాపును తీసుకోవాలి.

**ఏదో కోల్పోయానని కుమిలిపోకు, వున్నదానిని చూసి సంతోషించు**

**కత్తిరింపులు :**

లేత తోటల్లో భూమికి 1 మీటరు ఎత్తు వరకు ఉన్న క్రింది కొమ్మలను కత్తిరించి ఏపుగా వృత్తాకారంలో పెరిగేటట్లు మొక్కను ట్రిమింగ్ చేయాలి. ముదురు తోటల్లో ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జులై-ఆగస్టు మాసాల్లో ఎండుకొమ్మలు, భూమికి ఆనుకొని వున్న కొమ్మలు, ఇతర చెట్ల మీదకు పోయిన కొమ్మలు, నీడన వున్న కొమ్మలు మొదలగు వాటిని కత్తిరించడం వలన, శుభ్రంగా ఉంచడంతో పాటు మొక్కలకు తగినంత సూర్యరశ్మి వెలుతురు, గాలి సోకి కొమ్మలు ఎక్కువగా వచ్చి దిగుబడి పెరుగుతుంది.



**కలుపు నివారణ, అంతరకృషి :**

తోట నాటిన తరువాత తొలి 2-3 సం॥ వేసవికాలంలో దక్షిణ దిశలో తప్ప మిగిలిన దిశల్లో తాటాకులను కంచెగా ఏర్పాటు చేయాలి. లేత మొక్కల పాదుల్లో ఎండుగడ్డి లేదా ఎండు ఆకులు పరచటం వలన వేసవిలో నేల తేమ ఆవిరి కాకుండా కాపాడబడి, కలుపు నివారించబడుతుంది. తొలకరిలో వరుసల మధ్య భూమిని దున్ని కలుపు లేకుండా చేయాలి.

**ఎరువులు :**

ఎంపిక చేయబడిన అంటు మొక్కల్ని నాటటానికి ముందుగా గుంటల్లో 10 కిలోల పశువుల ఎరువు, 2 కిలోల వేపపిండి, 200 గ్రా, సూపర్ ఫాస్ఫేటును కలిపి వేయాలి. మొదటి సంవత్సరము మొక్కలకు సేంద్రియ ఎరువులను మాత్రమే ఇవ్వాలి. రెండవ సంవత్సరం నుంచి సేంద్రియ ఎరువులతో పాటు (వేపపిండి, పశువుల ఎరువు, కంపోస్టు) సిఫార్సు చేసిన మోతాదులో రసాయనిక ఎరువులు వేయాలి.

6 సంవత్సరాల వయస్సున్న జీడిచెట్లకు 500 గ్రా. నత్రజని (1100 గ్రా. యూరియా) 125 గ్రా. భాస్వరం (750 గ్రా, సూపర్ ఫాస్ఫేటు) 125 గ్రా. పొటాష్ (225 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్)ను ఇవ్వాలి.

రసాయనిక ఎరువులను చెట్టు మొదలు నుండి 1 మీ లేక 1 1/2 మీటరు దూరంలో చుట్టూ 15 సెం.మీ వెడల్పు , లోతు గాడి చేసి అందులో వేసి మట్టితో కప్పాలి. పైన వివరించిన మోతాదులో సగభాగం జూన్ - జులై నెలల్లో మిగిలిన సగభాగం సెప్టెంబరు - అక్టోబరు నెలల్లో వేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు .

**ఎరువుల పట్టిక**

| చెట్టు వయస్సు | మొదటి దఫా (గ్రా/చెట్టుకు) | | | రెండవ దఫా (గ్రా/చెట్టుకు) | | |
|---|---|---|---|---|---|---|
| | నత్రజని | భాస్వరం | పొటాష్ | నత్రజని | భాస్వరం | పొటాష్ |
| మొదటి సంవత్సరం | 0 | 0 | 0 | 0 | 0 | 0 |
| రెండవ సంవత్సరం | 100 | 25 | 25 | 100 | 25 | 25 |
| మూడవ సంవత్సరం | 150 | 40 | 60 | 150 | 40 | 60 |
| నాల్గవ సంవత్సరం | 200 | 50 | 60 | 200 | 50 | 60 |
| ఐదవ సంవత్సరం మరియు ఆపైన | 250 | 60 | 60 | 250 | 60 | 60 |

**అంతర పంటలు :** తోట నాటిన తొలి సంవత్సరాల్లో మొక్కల మధ్య గల స్థలంలో వివిధ కూరగాయలు, పూలమొక్కలలో బంతి, చేమంతి, ఏస్టర్స్, మల్లెపూవు తోటలను, అనాసపళ్ళ తోటలను, పొగాకు నారుమడి, మిరప, వరినారు, వేరుశనగ, పప్పుధాన్యాలను అంతర పంటలుగా పెంచి అధిక రాబడులను పొందవచ్చును.

**చిరునవ్వు మనసు పాడే మధురగీతం, ఆ మాధుర్యాన్ని ఆస్వాదించు**

**సస్యరక్షణ :** జీడిమామిడిని, కాండము ,వేరు తొలుచు పురుగు, లేత చిగురును, పుష్ప గుచ్ఛాలను ఆశించే టీ దోమ, అతి ముఖ్యమైన చీడపురుగులు, ఇవే కాకుండా ఆకు, పూత గూడు కట్టు పురుగు, ఆకుముడత పురుగు, కొమ్మ, పుష్ప గుచ్ఛాలను తొలిచే పురుగు, కాయ తినే,గింజ తినే పురుగు, తామర పురుగులు మొదలైనవి. నవంబరు – ఏప్రిల్ నెలల్లో ఆశించి రసము పీల్చటం వలన పంటకు ఎక్కువ నష్టం కలుగచేస్తాయి.

**కాండం తొలుచు, వేరు తొలుచు పురుగు :** సాధారణంగా కాండం తొలుచు, వేరు తొలుచు పురుగు నిర్లక్ష్యము చేయబడిన గింజల ద్వారా ఆపై వయస్సు గల చెట్ల కాండం మొదలు (3 అడుగుల ఎత్తువరకు) భూమిపైన కనపడే వేర్లు, సన్నని ఇనుపవైరుతో చేసిన బ్రష్‌తో బాగా రుద్ది ఆ తరువాత బాగా తడిసేలా 5 శాతం వేపనూనె ద్రావణాన్ని నాలుగు నెలలకు ఒకసారి చొప్పున సంవత్సరంలో మూడుసార్లు పిచికారి చేయాలి లేదా పూత పూయాలి. వేపనూనె నీటిలో కరగదు. కావున ప్రతి లీటరు నీటికి 0.5 గ్రా, సబ్బుగాని, సర్ఫ్‌గాని కలిపి గిలకొట్టి ఆ తర్వాత 50 మి.లీ. వేపనూనెను కలిపి బాగా కలిసేటట్లు పుల్లతో కలియపెట్టాలి. పైన చెప్పిన విధంగా కాండాన్ని, వేర్లను బ్రష్‌తో రుద్ది, వేపనూనె 5 శాతం సంవత్సరానికి మూడుసార్లు పిచికారి చేస్తే తోటలోని చెట్లకు ఈ పురుగు సోకే అవకాశం తగ్గుతుంది. ఈ పురుగు ఆశించిన చెట్లనుండి బంక కారుతూ ఉంటుంది. వెంటనే బెరడు క్రింద దాగి ఉన్న లద్దెపురుగులను తొలగించాలి. బెరడు చెక్కిన చోట వెంటనే కార్బరిల్ 4.0 గ్రా లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఈ పురుగులను తొలగించనట్లయితే క్రమేణా చెట్లు చనిపోతాయి. చెక్కిన బెరడు ముక్కలను కాండం నుండి కారిన బంకను, చెక్కపొడిని భూమిలో పాతిపెట్టాలి. తోటలను పరిశుభ్రంగా ఉంచాలి. తుది దశలో పురుగులు సోకిన చెట్ల ఆకులు పసుపు రంగుకు మారతాయి. ఆ తరువాత ఆకులన్ని రాలి మోడువారి, ఎండిపోయి చనిపోతాయి. కాబట్టి ఆకులు పూర్తిగా పసుపు రంగుకు మారగానే చెట్లను వెంటనే వేర్లతో సహా తీసి వేసి వేర్లలో దాగి వున్న ప్యూపాలను చంపి సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. చెట్లు తొలగించిన గుంటల్లో ఎండిన చెత్త వేసి తగుల బెట్టాలి.

**టీ దోమ :** ఈ పురుగు యొక్క తల్లి మరియు పిల్ల పురుగులు లేత కొమ్మలను, పూత రెమ్మలను ఆశించి రసాన్ని పీల్చటం వలన ఎర్రని జిగురు బిందువులు, పూత రెమ్మలపై నల్లని పొడవైన కండెఆకారపు మచ్చలు ఏర్పడతాయి. పూత, పిందెలు మాడిపోయి రాలిపోవటం వలన దిగుబడి తగ్గుతుంది. విపరీత పరిస్థితులలో చెట్టంగా మాడిపోయినట్లు అవుతుంది.

**ఆకు మరియు పూత గూడుకట్టు పురుగు :** ఈ పురుగు ముఖ్యంగా క్రొత్త చిగురు, పూత దశలో ఎక్కువగా కనిపిస్తుంది. ఆకులను, పూతను గూడు కట్టుటవలన కొమ్మల చివర బూజు గూళ్ళు ఏర్పడతాయి. లేత ఆకులను, కొమ్మలను చివర్లను, పుష్పగుచ్ఛాలను తినటం వలన పూత పూయక ఫలసాయం తగ్గుతుంది. ఇది ఎదుగుతూ ఉన్న గింజలను, పండ్లను గీకటం వలన కూడా దిగుబడి, నాణ్యత తగ్గుతాయి.

**కొమ్మ, పుష్పగుచ్ఛాలను తొలిచే పురుగు :** ఈ పురుగు లేత కొమ్మల చివర్లను తొలచి, సొరంగం చేసి లోపలి గుజ్జు తింటుంది. పుష్ప గుచ్ఛాలను కూడా తొలుస్తుంది. అందువలన లేతకొమ్మలు, పుష్పగుచ్ఛాలు ఎండిపోతాయి. ఫలితంగా దిగుబడి తగ్గుతుంది.

**కాయ, గింజ తినే పురుగు :** ఈ పురుగు కాయ, గింజ మధ్య గల ప్రదేశం ద్వారా లోపలికి ప్రవేశించి పండులోని గుజ్జును, గింజలోని పప్పును తింటుంది. ఫలితంగా గింజలు, కాయలు ఎదగక, కుళ్ళిపోయి, రాలి దిగుబడి తగ్గుతుంది.

**తామర పురుగులు :** ఈ పురుగులు పుష్పగుచ్ఛాలను, ఎదుగుతున్న కాయలను, పండ్లను గీకి రసం పీల్చటం వలన గరుకు మచ్చలు ఏర్పడి దిగుబడి, నాణ్యత తగ్గుతుంది.

డిసెంబరు – మార్చి నెలల్లో అవసరాన్ని బట్టి రెండు లేక మూడుసార్లు పురుగు మందులను పిచికారి చేసి అన్ని పురుగులను అదుపు చేయవచ్చు. మొదటిగా మోనోక్రోటోఫాస్‌ను డిసెంబరు, జనవరిలో (1.4 మి.లీ. / లీ.), రెండవసారి ఎండోసల్ఫాన్‌ను జనవరి – ఫిబ్రవరిలో (1.4 మి.లీ./లీటరు) మరియు మూడవసారి అవసరమైతే కార్బరిల్‌ను మార్చిలో (2 గ్రా / లీటరు) పిచికారి చేసిపైన చెప్పిన అన్నిరకాల పురుగులను అదుపులో ఉంచవచ్చు. పై మందులు కాక క్లోరిఫైరిఫాస్ (2.5 మి.లీ. /లీటరు నీటికి), ప్రొఫెనోఫాస్ (1.0 మి.లీ / లీటరు నీటికి) కూడా వాడుకొనవచ్చును.

**మనకు వచ్చేదాంతో రోజులు వెళ్ళదీస్తాం, మనం ఇచ్చేదాంతో నిజమైన జీవితం గడుపుతాం**

**తెగుళ్ళు**

**బ్లైట్ :** ఈ తెగులు వలన పుష్పగుచ్ఛాలు, ఎదుగుతున్న గింజలు మెత్తబడి, పూర్తిగా ఎదగక ఎండి రాలిపోతాయి. అవసరాన్ని బట్టి కార్బండైజిమ్ 1.0 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**దిగుబడి :** 3వ సంవత్సరములో అంటుమొక్కల నుండి కాపు తీసుకోవాలి. చెట్ల వయస్సు పెరిగే కొద్దీ పంట దిగుబడి పెరుగుతుంది. మంచి రకాల అంట్ల ద్వారా తోటలు పెంచినపుడు 10 సంవత్సరాల వయసు గల తోటల నుండి సరాసరి చెట్టుకు 10 కిలోల కన్న ఎక్కువ దిగుబడి లభిస్తుంది. ఒక కిలో గింజల నుండి 250 గ్రా. పైగా పప్పు లభిస్తుంది. చెట్ల క్రింద రాలిన జీడిపండ్ల నుండి జీడి పిక్కలను వేరు చేసి దాదాపు వారం రోజులు పిక్కలను ఎండబెట్టాలి.

**జీడి అంట్లు దొరికే ప్రదేశాలు :**

1. సీనియర్ సైంటిస్ట్ (హార్టికల్చర్) జీడిమామిడి పరిశోధనా స్థానం, బాపట్ల – 522 101, గుంటూరు జిల్లా

2. సీనియర్ సైంటిస్ట్ (హార్టికల్చర్), ఉద్యానవన పరిశోధనా స్థానం, అశ్వరావుపేట 507 306 ఖమ్మం జిల్లా, ఫోన్ : 08740-255641

3. జాతీయ జీడిమామిడి పరిశోధనా స్థానం, పుత్తూరు దక్షిణ కన్నడ జిల్లా, కర్నాటక ఫోన్ నెం. 08251-231530

❐

## మహిళల ప్యాంటీస్ తయారీ పరిశ్రమ

**(25వ పేజీ తరువాయి..)**

రెండు నెలల వర్కింగ్ క్యాపిటల్ అవసరం =

| | |
|---|---|
| రూ. 4,00,000 × 2 = | 8,00,000 |
| మొత్తం పరిశ్రమ పెట్టుబడి = | రూ. |
| స్థిర వ్యయాలు | 17,00,000 |
| వర్కింగ్ క్యాపిటల్ | 8,00,000 |
| మొత్తం | 25,00,000 |

| **వనరుల సమీకరణ :** | **(రూ.లక్షలలో)** |
|---|---|
| వ్యవస్థాపకుని మూలధనం | 8,24,000 |
| దీర్ఘకాల రుణం | 10,76,000 |
| వర్కింగ్ క్యాపిటల్ రుణం | 6,00,000 |
| మొత్తం | 25,00,000 |

**లాభదాయకత అంచనా :**

ఎ. సంవత్సర మొత్తం అమ్మకపు ఆదాయం(రూ.లక్షలలో)

| | |
|---|---|
| 1,44,000 × రూ. 50/- | 72,00,000 |
| మొత్తం సంవత్సర ఆదాయం | 72,00,000 |

మొత్తం సంవత్సర వ్యయాలు :

| | |
|---|---|
| 1. ఉత్పాదక వ్యయాలు<br>రూ. 4,00,000 × 12 | 48,00,000 |
| 2. తరుగుదల 14,35,000 × 15% | 2,15,150 |
| 3. రుణాలపై వడ్డీ 10,76,000 + 6,00,000 =<br>16,76,000 × 13.75% | 2,30,450 |
| 4. ప్రాథమిక, ప్రారంభం ముందు వ్యయాల రద్దు | 1,65,000 |
| మొత్తం వ్యయాలు | 54,10,700 |

| లాభం : | (రూ.లక్షలలో) |
|---|---|
| సంవత్సరం మొత్తం అమ్మకాలు | 72,00,000 |
| (–) సంవత్సరం మొత్తం వ్యయాలు | 54,10,700 |
| లాభం | 17,89,300 |

లాభదాయకత విశ్లేషణ :

| | |
|---|---|
| 1. అమ్మకాలపై లాభం<br>17,89,300 ÷ 72,00,000 × 100 | 24.85% |
| 2. మొత్తం పెట్టుబడిపై ఆదాయం<br>17,89,300 ÷ 25,000 × 100 | 71.56% |
| 3. వ్యవస్థాపకుని మూలధనంపై లాభం<br>17,89,300 ÷ 8,24,000 × 100 | 217% |

గమనిక : ఆర్థిక వివరాలు అన్నీ అంచనాలే. వాస్తవంలో కొంత హెచ్చు తగ్గులుండగలవు.

(వ్యాస రచయిత బిజినెస్ కన్సల్టెంట్, సెల్ : 9866119816)

❐

**పొదిగితేనే గుడ్డు నుంచి కోడిపిల్ల వస్తుంది, గుడ్డును బద్దలు కొడితే కాదు**

# గ్రామ పంచాయతీలో పనులు నిర్వహించే పద్ధతి

**అ**విభాజ్య ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం, 1994 నందలి సెక్షను 45 ప్రకారం గ్రామ పంచాయతీ తప్పనిసరిగా పంచాయతీ ఆమోదించిన బడ్జెట్ కేటాయింపుల మేరకు గ్రామంలో రోడ్ల నిర్మాణం, బావుల త్రవ్వకం, కల్వర్టుల నిర్మాణం, నిర్వహణ మొదలైన పనులు చేయవలసి ఉంటుంది. గ్రామ పంచాయతీలు ఈ పనులను నిర్వహించ వలసిన పద్ధతి ఏమిటో (జి.ఓ.యం.ఎస్.నెం.44, పి.ఆర్ & ఆర్.డి. (రూల్-4 తేదీ: 10.12.2002) ఇపుడు చూద్దాం.

**పనుల గుర్తింపు :**



ముందుగా గ్రామంలో అవసరం మేరకు చేయవలసిన పనులను గుర్తించాలి. అందుకు గాను గ్రామ ప్రజలను సంప్రదించవలసిన అవసరం ఎంతైనా ఉంది. కనుక సర్పంచ్ గ్రామ సభ సమావేశాన్ని ఏర్పాటుచేసి ప్రజలు కోరిన పనుల జాబితాను తయారుచేసి గ్రామ సభలో ఆమోదం పొందాలి.

కానీ గ్రామసభ ఆమోదించిన పనులన్నీ చేయడానికి గ్రామ పంచాయతీ ఆర్థిక స్థోమత సరిపోక పోవచ్చు. అందువల్ల గ్రామ పంచాయతీలో నిధుల లభ్యతను బట్టి (గ్రామ పంచయతీ సాధారణ నిధులు, వివిధ రకాలైన ప్రభుత్వ గ్రాంట్ల నుండి వచ్చే కేటాయింపులు మొదలగు వాటిని పరిగణలోకి తీసుకొని), చేయవలసిన పనులలో ప్రాధాన్యతా క్రమాన్ని నిర్ధారించుకొని గ్రామ పంచాయతీ తన తీర్మానం ద్వారా ఆమోదించాలి.

గ్రామ పంచాయతీ సాధారణ నిధుల నుండి పనులు నిర్వహించుటకు 'టెండరు' పద్ధతిని, ప్రభుత్వ గ్రాంట్ల నుండి పనులను 'డిపార్టుమెంటల్'గా నిర్వహించవలసి ఉంటుంది. చేయవలసిన పనులు ఏ నిధుల నుండి నిర్వహించాలనేది స్పష్టంగా గ్రామ పంచాయతీ తీర్మానంలో తెలియజేయాలి.

గ్రామ పంచాయతీ తీర్మానం తదుపరి సదరు తీర్మానపు నకలును జత చేస్తూ సంబంధిత విస్తరణాధికారి, (పి.ఆర్. & ఆర్.డి) ద్వారా తీర్మానంలో చూపబడిన పని లేదా పనులకు అంచనాలు తయారుచేయవలసినదిగా కోరుతూ పంచాయతీ కార్యదర్శికి లేఖ రాయాలి. సదరు లేఖను అనుసరించి ఇంజనీరింగు డిపార్టుమెంటువారు తయారుచేసిపంపిన అంచనాలు గ్రామ పంచాయతీకి అందిన తదుపరి, గ్రామ పంచాయతీలో నిధులు లభ్యత గురించి తీర్మానం ద్వారా 'పరిపాలనా ఆమోదం' యినస్తూ 'సాంకేతిక ఆమోదం' కోసం ఇంజనీరింగు శాఖ వారికి సదరు ప్రతిపాదనను పంపవలసి ఉంటుంది.

పరిపాలనా ఆమోదం తదుపరి సాంకేతిక ఆమోదం ఇచ్చే అధికారం ఈ కింద తెలిపిన విధంగా వుంటుంది.

| క్రమ సం. | పని అంచనా విలువ | ఆమోదించు అధికారి |
|---|---|---|
| 1. | రూ. 1,00,000/- | మైనరు గ్రామ పంచాయతీ |
| 2. | రూ. 2,00,000/- | మేజరు గ్రామ పంచాయతీ |
| 3. | రూ. 3,00,000/- | డివిజన్ పంచాయతీ అధికారి |
| 4. | రూ. 3,00,000/- మించిన పనులకు | జిల్లా కలెక్టరు |

పరిపాలనా ఆమోదం పిదప అంచనాలను సాంకేతిక ఆమోదం కోసం ఇంజనీరింగ్ శాఖకు పంపవలసి ఉంది. సాంకేతిక ఆమోదం ఇచ్చే అధికారం ఈ కింద తెలిపన విధంగా ఇవ్వబడి ఉంది.

**ఎవరిని ఎవరూ చిన్నబుచ్చలేరు, తమ చర్యల ద్వారా తమకు తాము తప్ప!**

| క్రసం | అధికారి హోదా | పనుల అంచనా మొత్తం |
|---|---|---|
| 1. | సహాయక ఇంజనీరు/ సహాయక కార్యపాలక ఇంజనీరు | రూ. 25,000/- వరకు |
| 2. | ఉప కార్యనిర్వాహక ఇంజనీరు | రూ. 2,00,000/- వరకు |
| 3. | కార్యనిర్వాహక ఇంజనీరు | రూ. 10,00,000/- వరకు |
| 4. | పర్యవేక్షక ఇంజనీరు | రూ. 50,00,000/- వరకు |
| 5. | ఇంజనీరు ఇన్ చీఫ్/ చీఫ్ ఇంజనీరు | రూ. 50,00,000/- వరకు |

రూ. 2 లక్షల వరకు విలువ గల పనులకు టెండరు షెడ్యూల్డు, టెండరు నోటీసులను ఆమోదించుటకు, టెండరు అంచనా రేట్లను ఆమోదించుటకు ఉప కార్యపాలక ఇంజనీరుగారి ఆమోదం పొందవలసి ఉంటుంది.

పనులు గ్రామ పంచాయతీ నిధులతో చేపట్టుటకు నిర్ణయించినచో రూ. 50,000/- మించిన అంచనాలు గల పనులను ముఖ్యంగా టెండర్ ద్వారా పనులను కేటాయించ వలసి ఉండును. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసిన గ్రాంట్లతో (యస్.యఫ్.సి.,టి.యఫ్.సి) చేసే పనులను ప్రభుత్వంచే విడుదల చేయబడిన సూచనల మేరకు నిర్వహిం చాల్సి ఉంది. పంచాయతీ నిధులతో రూ. 50,000/- మించిన అంచనా విలువ గల పనులను టెండరు నోటీసు ప్రకటించుట ద్వారా ఆ శక్తిగల టెండరుదారులనుండి టెండర్లు స్వీకరించ వలెను. టెండరు షెడ్యూల్డులో సూచించబడిన రేట్లకు, టెండరు నోటీసును ఉప కార్యపాలక ఇంజనీరుగారిచే ఆమోదించబడ వలెను. టెండరు నోటీసును ఆ ప్రాంతమందు ఎక్కువ సర్క్యులేషన్ కలిగిన మూడు ముఖ్యమైన దిన పత్రికలందు ప్రచురించుట ద్వారా టెండరు నోటీసును జారీ చేయవలెను.

టెండరు నోటీసులో పని పేరు, అంచనా విలువ, పని పూర్తి చేయుటకు కావలసిన సమయం, చెల్లించవలసిన టెండరు ధరావత్తు, పూర్తిచేసిన టెండరు షెడ్యూలును దాఖలు చేయుటకు ఇవ్వబడిన సమయం, టెండరు తెరుచు సమయం మొదలగునవి తెలియపరచవలసి ఉంది.

టెండరు షెడ్యూలు తెరచిన తదుపరి, టెండరుదారులు తమ టెండర్లలో దాఖలు చేసిన రేట్ల వివరాలను తెలియపరచు 'కంపారటేటివ్' స్టేట్‌మెంటు తయారుచేసి గ్రామ పంచాయతీ ముందు ఉంచవలెను. గ్రామ పంచాయతీ తక్కువ రేటు 'కోట్' చేసిన టెండరును ఆమోదించవలసి ఉంది. అలా ఆమోదింపబడిన టెండరుదారుడు గ్రామ పంచాయతీ కార్యదర్శి వారి ద్వారా గ్రామ పంచాయతీ పేరున స్టాంపు పేపరుపై 'అగ్రిమెంటు' కుదుర్చుకొనుట ద్వారా సదరు పనిని చేయుటకు అర్హత పొందగలరు. తదుపరి కార్యనిర్వహణ అధికారి తన ఉత్తర్వుల ద్వారా 'వర్కు ఆర్డరు' జారీ చేయవలసి ఉంది. సంబంధిత మండల ఇంజనీరింగు అధికారికి టెండరుదారుడు తన పర్యవేక్షణలో, సకాలంలో పనిని నిర్వహించేలాగా కోరుచూ 'వర్కు ఆర్డరు' ప్రతిని పంపవలెను.

పని జరుగునప్పుడు, మొదటి విడత బిల్లు చెల్లించుటకు గాను ఇంజనీరింగు అధికారి వారి మెజరుమెంటు 'యం.బుక్' పుస్తకంలో చేయడిన పని యొక్క కొలతలను రాసి, చేయబడిన పనిని పై అధికారులతో 'చెక్ మెజరుమెంటు' చేయించి, టెండరుదారుడు తాను గ్రామ పంచాయతీతో చేసుకొన్న 'అగ్రిమెంటు'ననుసరించి చెల్లించవలసిన మొత్తమును యం.బుక్‌లో రికార్డు చేసి బిల్లుతోపాటు 'సి, ఫారం' పూర్తిచేసి చెల్లింపులకై గ్రామ పంచాయతీకి పంపవలెను.

చెల్లించవలసిన మొత్తం నుండి ఈ కింద చూపబడిన మొత్తములను మినహాయించవలసి ఉంది.

**బిల్లు మొత్తంలో మినహాయింపులు**

* సీవరేజి రుసుం, ఆదాయపు పన్ను
* పి.యస్.ఛార్జీలు, వ్యాట్ పన్ను
* 2.5% కన్నా చెల్లించబడియున్న ధరావత్తు సొమ్ము
* టూల్స్ అండ్ ప్లాంట్స్
* డిపార్టుమెంటు ద్వారా సరఫరా చేసిన వస్తువుల విలువ

రెండవ బిల్లులో పై వాటితో పాటు మొదటి విడతగా చెల్లించే మొత్తం కూడా మినహాయించవలసి వుంటుంది. ఆఖరి బిల్లు చెల్లించుటకు ముందు జిల్లా ప్రజా పరిషత్ 'అకౌంట్సు ఆఫీసర్'గారి పరిశీలన తరువాతనే చెల్లింపులు చేయాలి. ❐

**అసంతృప్తిని మించిన అపరాధం మరొకటి లేదు**

# కుటీర పరిశ్రమగా పుట్టగొడుగుల పెంపకం

గ్రామాలలో పండే పంటల ఆధారంగా గ్రామీణ మహిళలు ఎన్నో వ్యవసాయ అనుబంధ కుటీర పరిశ్రమలు నెలకొల్పుకొని ఆదాయం పొందవచ్చు. అదనపు ఆదాయం ఆర్జించగల ఆహార, కుటీర పరిశ్రమలు గ్రామీణ మహిళలకు అనుకూలంగా ఉంటాయి. ఇంటి వద్దే వీటిని నిర్వహించుకొన వచ్చు. ఇలాంటివాటిలో పుట్టగొడుగుల పెంపకం పరిగణించ దగినది. పుట్ట గొడుగులు శిలీంధ్ర జాతికి చెందిన మొక్కలు వీటిలో ముత్యపు చిప్ప పుట్ట గొడుగులు, వరిగడ్డి పుట్ట గొడుగులు, తెల్ల గుండీ పుట్టగొడుగులు, పాలమీగడ లాంటి పుట్ట గొడుగులు మొదలైన అనేక రకాలు ఉన్నాయి.

**ముత్యపు చిప్ప పుట్ట గొడుగులు**

ముత్యపు చిప్ప పుట్ట గొడుగులు సమశీతోష్ణ, ఉష్ణ మండలాల్లో పెంచటానికి అనువైనవి.

**కావలసిన వసతులు / వస్తువులు**

పాక లేదా గది; వెదురు లేదా కలప లేదా ఇనుముతో చేసిన అరలు, విత్తనం సంచులు (60 సెం.మీ, 30 సెం.మీ వెడల్పు, 70-100 గేజి మందం గలవి). దారం, ప్లాస్టిక్ ట్రేలు, గోతం పట్టాలు, డెట్టాల్ ద్రావణం, పాలిడాల్ లేదా లిండేన్ పొడి.



**పుట్ట గొడుగుల విత్తనం (స్పాన్) తయారీ విధానం**

పుట్ట గొడుగుల పెంపకానికి కావలసిన విత్తనాలను స్పాన్ అంటారు. ఇందులో ముఖ్యంగా తెల్లని దారం లాంటి పదార్థం, జొన్నలు మొదలైనవి ఉంటాయి. మామూలుగా పొలంలో విత్తనాలను విత్తి, మొక్కలను వచ్చేటట్లు చేసినట్లుగా ఇక్కడ పుట్ట గొడుగుల పెంపకానికి స్పాన్ చాలా అవసరం. మనం వాడే స్పాన్ స్వచ్ఛత మీద పంట దిగుబడి ఆధారపడి ఉంటుంది.

**కావలసిన వస్తువులు**

తల్లి స్పాన్ (పరీక్ష నాళికలోని స్పాన్), ప్రెషర్ కుక్కర్ లేదా ఆటోక్లేవ్, ఇనాక్యులేషన్ చాంబర్ (5' 6' 7), అతి నీల లోహిత బల్బు, జొన్నలు లేదా గోధుమలు, జొన్నలు ఉడక బెట్టేందుకు స్టవ్ లేదా పొయ్యి, పెద్ద పాత్ర, గ్లూకోజ్ లేదా సెలైన్ సీసాలు (ప్లాస్టిక్ సంచులు), నీటిని పీల్చని దూది, సారా దీపం, ఇనాక్యులేషన్ నీడిల్, కాల్షియం కార్బొనేట్ లేదా చాక్ పౌడర్, లిండేన్ పొడి, దారం, రబ్బరు బాండ్స్. మంచి మొక్కజొన్నలను మంచి నీటిలో కడగాలి. కడిగిన పదార్థాలను 30 నిమిషాలు ఉడకబెట్టి ఎక్కువగా వున్న నీటిని తీసివేయాలి. ఒక కిలో ఉడక బెట్టిన పదార్థానికి 20 గ్రా. కాల్షియం కార్బొనేట్ పొడిని కలపాలి. పై మిశ్రమాన్ని స్పాన్ సీసాలో లేదా ప్లాస్టిక్ సంచులలో మూడో వంతు వరకు నింపి శుభ్రమైన దూదితో గట్టిగా మూత పెట్టాలి.

నలుచదరంగా ఉన్న నాలుగు కాగితపు ముక్కలను దూదిపై ఉంచి, సీసాను లేదా ప్లాస్టిక్ సంచిని దారం తో గట్టిగా కట్టాలి. ఇలా కట్టిన సీసా లను ఆటోక్లేవ్‌లో 15పౌండ్ల పీడనం వద్ద ఒకటిన్నర గంటపాటు ఉంచి, తర్వాత గదిఉష్ణోగ్రత వద్ద ఉంచాలి. శుభ్రపరిచిన స్పాన్ సీసాలను ఇనా క్యులుషన్ చేయటానికి అతి నీలలోహిత బల్బు అవసరం. ఇది లేకపోతే సారాదీపం వద్ద ఇనాక్యులేషన్ చేయవచ్చు. సీసాలను ఆటోక్లేవ్‌లో నుండి తీసిన తర్వాత 24 గంటల పాటు అలానే ఉంచి, తర్వాత వాటిలోని పరీక్ష నాళికలోని తల్లి స్పాన్ ఇనాక్యులేషన్ నీడిల్ సహాయంతో సీసాలోకి కొద్దిగా వేసిన వెంటనే, శుభ్రమైన దూదితో మూసివేయాలి.

ఈ విధంగా ఇనాక్యులేట్ చేసిన తర్వాత, కాగితంతో కప్పి, దారంతో బిగించాలి. ఇనాక్యులేట్ చేసిన సీసాలను గది ఉష్ణోగ్రతలో అంటే 24-28 డిగ్రీల మధ్య 10-15 రోజుల పాటు ఉండనివ్వాలి. వారంరోజుల తర్వాత సీసాలను బాగా గుండ్రంగా, వేగంగా తిప్పితే, శిలీంధ్ర దారాలుముక్కలు, ముక్కలుగా అయి, సీసాలోని గింజలన్నింటికి అంటు

**ఆలోచనలలో బలంలేని వారినే మూఢనమ్మకాలు ఆవేశిస్తాయి**

కుంటుంది. సీసాలను ఉంచిన గది చల్లగా ఉండాలి. మూడు వారాల్లో శిలీంధ్రం పెరిగి, వాడడానికి సిద్ధంగా ఉంటుంది.

**స్పాన్ తయారు చేసేవారు, కొనేవారు గమనించవలసినవి**

స్పాన్ ఎప్పుడు సిల్కులాగా నిగనిగలాడుతూ ఉండాలి. అంతేగాని, దూదిలాగా ఉండకూడదు. దీనివలన పుట్ట గొడుగుల దిగుబడి అధికంగా వస్తుంది. స్పాన్ సీసాలోని గింజల చుట్టూ శిలీంధ్ర దారం ఉండేలా చూసి ఎన్నిక చేయాలి. గింజల చుట్టూ మైసీలియం లేకపోతే, స్పాన్ పెరిగేటప్పుడు కలుషితమయ్యే ఆస్కారముంది. మంచి స్పాన్ ఎప్పుడూ తెల్లగా ఉంటుంది. స్పాన్ పెరిగే కొద్ది గోధుమ రంగుకు మారుతుంది. తాజా స్పాన్ ఎప్పుడూ అధిక దిగుబడి నిస్తుంది. స్పాన్ సీసాలో ఆకుపచ్చ, నల్లచుక్కలు ఉంటే తీసి వేయాలి. ఎందుకంటే, వేరే ఇతర శిలీంధ్రాల వలన అవి చెడిపోయినవిగా గుర్తించాలి. స్పాన్ సీసాలో మెరిసే పసుపు రంగులో చిక్కటి ద్రావణం ఉన్నట్లయితే, అవి బ్యాక్టీరియా వలన చెడిపోయినట్లుగా గుర్తించాలి. పాత స్పాన్ వాడటం వలన దిగుబడి తగ్గుతుంది.

**గుర్తుంచుకోవలసిన అంశాలు**

రవాణా చేసే సమయంలో స్పాన్ ఉంచిన కంటైనర్‌లో ఉష్ణోగ్రత 35 డిగ్రీల సెల్సియస్ కన్న ఎక్కువగా ఉండకూడదు. స్పాన్‌ను 5-10 డిగ్రీల సెల్సియస్ వద్ద దాదాపు నెలరోజులు నిల్వ ఉంచవచ్చు. వరిగడ్డి పుట్టగొడుగుల స్పాన్‌ను ఎప్పుడూ ఫ్రిజ్‌లో ఉంచరాదు. ఒకసారి స్పాన్ సీసాను తెరిచిన తర్వాత మొత్తం స్పాన్‌ను వాడాలి కానీ, మిగల్చడం చేయకూడదు.

**పెంచే విధానం**

ఎండు గడ్డిని 3 నుండి 4 సెం.మీ పొడవు ముక్కలుగా చేసి మంచి నీటిలో 12-14 గంటలు నాన బెట్టాలి. తర్వాత నీటిని తీసివేసి గడ్డి ముక్కలను మరిగే నీటిలో 20-30 నిమిషాలు ఉంచి తీయటం ద్వారా శుద్ధి చేయాలి. నీటిలో నుంచి ముక్కలను బయటకు తీసి నీడలో ఆరబెట్టాలి. విత్తనాన్ని, శుభ్రపరచిన ట్రేలోకి తీసుకొని మైనపు సంచుల్లో 5 సెం.మీ ఎత్తున శుద్ధి చేసిన గడ్డిని పరిచి, దానిపైన పిడికెడు విత్తనాన్ని చల్లాలి. ఈ విధంగా నాలుగైదు వరుసల్లో నాల్గు ముక్కలను, విత్తనాన్ని వేసిన తర్వాత సంచి మూతిని దారంతో కట్టి వేయాలి. ఈ దశలో మైనపు సంచులను దిండ్లు (దీవస్) అంటారు. ఇలా తయారుచేసిన దిండ్లను చెక్క అరల్లో లేదా తాళ్ళతో చేసిన ఉట్లలో అమర్చాలి. గదిలో ఉష్ణోగ్రత, తేమ సరిగా ఉంచడం కోసం గది గోడల చుట్టూ గోతాలను వ్రేలాడ దీసి వాటిని క్రమం తప్పకుండా నీటితో తడుపుతూ ఉండాలి. దిండ్లు తయారుచేసిన 12 - 15 రోజుల్లో శిలీంధ్రం గడ్డి ముక్కలనంతా అల్లుకొని తెల్లటి ముద్దలాగా అవుతుంది. ఈ దశలో మైనపు సంచులను తీసివేయాలి. ఆ తర్వాత 3-4 రోజుల్లో గుండు సూది తలలాగా పుట్ట గొడుగులు బయటికి వచ్చి మరో 2-3 రోజులకు బాగా ఎదుగుతాయి. ఒక్కొక్క దిండు నుండి మూడు నాలుగు సార్లుగా 1 నుంచి 1 1/2 కిలోల పుట్ట గొడుగులు వస్తాయి. పంట అయిపోయిన తర్వాత దిండ్లను ఎరువుగా వాడుకోవచ్చు.

**తీసుకోవలసిన జాగ్రత్తలు**

దిండ్లను చీమలు పట్టకుండా చూడాలి. గదిలోనికి ఎండ, వాన పడకుండా చూడాలి. గదిలో ఉష్ణోగ్రత, తేమ సరిగా ఉండేటట్లు చూడాలి. దిండ్లు నలుపు లేదా పసుపురంగులోనికి మారిన ఎడల నాటిన వెంటనే తీసివేయాలి. పుట్ట గొడుగులు సరిగా ఎదిగిన తర్వాతనే కోయాలి.

**లాభాలు**

పెంచే విధానం తేలిక. తక్కువ స్థలంలో, తక్కువ ఖర్చుతో అధిక ఉష్ణోగ్రతలుండే వేసవిలో తప్ప మిగతా అన్ని రుతువుల్లోను పండించవచ్చును. కూరగాయలతో, పండ్లతో పోల్చిన ఎడల పుట్ట గొడుగుల్లో ఎక్కువ మాంసకృత్తులు, విటమిన్లు, ఖనిజ లవణాలు ఉంటాయి. శాఖాహారం కనుక అందరూ తినవచ్చును. క్రొవ్వు పదార్థాలు, చక్కెర లేని ఆహారం కనుక గుండె జబ్బు, చక్కెర వ్యాధి, ఊబకాయం గలవారికి సురక్షితమైన, శ్రేష్టమైన ఆహారం. వీటిని కూరలాగా వండుకొనవచ్చును. పచ్చళ్ళ రూపంలో వాడుకొనవచ్చు. పుట్ట గొడుగులను ఎండబెట్టి పొడి చేసి సూప్ లాగా లేదా, మసాలా పొడిలాగా వాడుకోవచ్చు. ❐

**ఓటమి ... నీకు గెలవాలన్న తపన లేదనడానికి సూచన**